ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
జగిత్యాల
జిల్లా వార్తలు
5★★
శుక్రవారం 14 నవంబరు 2025



భూ వివాదం చుట్టూ రాజకీయం

- పెట్రోలు బంకు స్థలంపై కొనసాగుతున్న విచారణ
- కొనుగోలు చేశామంటున్న నిర్వాహకులు
- రూ.100 కోట్ల స్థలం ఆక్రమించారంటున్న అధికార, ప్రతిపక్ష నేతలు
- విచారణకు అదనపు కలెక్టర్ నేతృత్వంలో కమిటీ
- నాలుగు రోజులుగా స్థల కొలతల సేకరణ



వివాదాస్పద పెట్రోలు బంకు స్థలం

జగిత్యాల, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని కొత్త బస్టాండు సమీపంలో గల పెట్రోలు బంకు స్థల వివాదం చుట్టూ రాజకీయం జోరుగా సాగుతోంది. అధికార, ప్రతిపక్ష నేతలు సంబంధిత స్థల వివాదంపై ఆరోపణలు, ప్రత్యారోపణలు చేస్తూ ర్యాలీలు నిర్వహించారు. కలెక్టర్ సత్యప్రసాద్‌కు లేఖ రాయడం, జిల్లా, రాష్ట్ర స్థాయి ప్రజాప్రతినిధులు, అధికారుల దృష్టికి తీసుకువెళ్లి ఒత్తిడి తీసుకొస్తున్నారు. ఈ వ్యవహారంపై విచారణ జరిపి నిజానిజాలు తేల్చాలంటూ అదనపు కలెక్టర్ రాజాగౌడ్, జగిత్యాల ఆర్డీవో మధుసూదన్, మున్సిపల్ కమిషనర్ స్పందన తదితర అధికార బృందంతో కలెక్టర్ సత్యప్రసాద్ ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేసి విచారణకు ఆదేశించారు. పెట్రోల్ బంకు స్థలం విలువ సుమారు రూ.వంద కోట్లు ఉంటుందని, స్థలాన్ని ఆక్రమించారంటూ పలువురు నాయకులు ఆరోపిస్తున్నారు.

● స్థలంపై మాజీ మంత్రి జీవన్‌రెడ్డి ఆరోపణలు

పట్టణ నడిబొడ్డున గల సుమారు రూ.వంద కోట్ల స్థలాన్ని ఎటువంటి యాజమాన్య హక్కులు లేకుండా సదరు వ్యాపారి వారసులు స్వాధీనంలో ఉంచుకున్నారని ఆరోపిస్తూ, ఇందుకు సంబంధించిన పలు పత్రాలను చూపిస్తూ మాజీ మంత్రి తాటిపర్తి జీవన్ రెడ్డి ఇటీవల ఆరోపణలు చేశారు. దీంతో సదరు స్థలం మున్సిపాలిటీకి చెందినదా లేక పెట్రోలు బంకు నిర్వాహకులు యాజమాన్య హక్కులు పొందారా అన్న విషయం వివాదాస్పదంగా మారింది. కాగా 1952 సంవత్సరంలో మున్సిపల్ అధికారులు అప్పటి సమయంలో ఓ వ్యాపారికి లీజుకు ఇచ్చిన స్థలంపై గతంలో పలు సందర్భాల్లో సైతం వివాదాలు తలెత్తినట్లు స్థానికులు పేర్కొంటున్నారు.

● ప్రతిపక్ష బీజేపీ, బీఆర్‌ఎస్‌లు సైతం..

వివాదాస్పద స్థల వ్యవహారంపై ఇటీవల ప్రతిపక్ష పార్టీలయిన బీజేపీ, బీఆర్‌ఎస్‌లకు చెందిన నేతలు సైతం స్పందించారు. వివాదాస్పద స్థలంపై పారదర్శకంగా విచారణ జరిపించాలని కోరుతూ ఇటీవల ప్రజావాణిలో అదనపు కలెక్టర్ బీఎస్ లతను బీఆర్‌ఎస్‌కు చెందిన జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంతతో పాటు పలువురు బీఆర్‌ఎస్ నాయకులు కలిసి వినతిపత్రం అందించారు. ఆక్రమణ జరిగితే తక్షణమే ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని డిమాండ్ చేశారు. సదరు స్థలాన్ని ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని డిమాండ్ చేస్తూ ఇటీవల పలువురు బీజేపీ నేతలు పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ బోగ శ్రావణి సైతం స్పందించి పెట్రోల్ బంకు స్థల కబ్జా వ్యవహారమే తన రాజీనామాకు కారణమని వెల్లడించారు. ఈ వ్యవహారం వెనుక ఎమ్మెల్యే మాకునూరి సంజయ్ కుమార్ మద్దతు ఉందని ఆమె ఆరోపించారు. మున్సిపల్ మాజీ కౌన్సిలర్ అనుమల్ల జయశ్రీ ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి లేఖను రాసి వివాదస్పద స్థలం స్వాధీనం చేసుకోవాలని కోరారు.

● కలెక్టర్‌కు ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ లేఖ

జిల్లా కేంద్రానికి చెందిన పలువురు రాజకీయ నేతల విమర్శలపై ఇటీవల జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ మాకునూరి సంజయ్ కుమార్ స్పందించారు. స్థల వివాదంపై తనకు ఎలాంటి సంబంధం లేదని చెప్పుకొచ్చారు. వివాదాస్పద స్థలంపై సమగ్ర విచారణ జరపాలంటూ కలెక్టర్ సత్యప్రసాద్‌కు లేఖ రాశారు. పలువురు రాజకీయ దురుద్దేశంతో ఆరోపణలు చేస్తున్నారని స్పష్టం చేశారు. అధికార పార్టీకి చెందిన మాజీ మంత్రి తాటిపర్తి జీవన్‌రెడ్డి, బీజేపీకి చెందిన మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ బోగ శ్రావణి, బీఆర్‌ఎస్‌కు చెందిన జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత తదితరులు వివాదాస్పద స్థలంపై స్పందించడం, ఆరోపణలు, ప్రత్యారోపణలు చేయడంతో జిల్లా కేంద్రంలో రాజకీయం వేడెక్కింది.

● కొనసాగుతున్న విచారణ

పెట్రోలు బంకు స్థల వివాదంపై కలెక్టర్ సత్యప్రసాద్ ఆదేశాల మేరకు ఇటీవల అధికారులు విచారణ చేపట్టారు. మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధి

(మిగతా 8వ పేజీలో)



స్థలంపై విచారణ జరుపుతున్న మున్సిపల్, సర్వే విభాగం అధికారులు

● స్థల వివాదానికి దారి తీసిందిలా...

జిల్లా కేంద్రంలోని 138 సర్వే నంబరులో గల సుమారు 20 గుంటల స్థలాన్ని ప్రజా అవసరాల కోసం 1952 సంవత్సరంలో అప్పటి మున్సిపల్ పాలకవర్గం పెట్రోలు, డీజిల్ బంక్‌తో పాటు కిరోసిన్ అవుట్ లెట్ నిర్వహణ కోసం ఓ ప్రైవేటు వ్యక్తికి లీజుకు ఇచ్చారు. ఆ సమయంలో సంబంధిత స్థలంలో సదరు వ్యాపారి కిరోసిన్, పెట్రోలు విక్రయాలు జరిపారు. తదుపరి సదరు వ్యాపారికి చెందిన పలువురు వారసులు మున్సిపల్ నుంచి కొనుగోలు చేశామని వాదిస్తున్నారు. ప్రస్తుతం సంబంధిత స్థలం సదరు వ్యాపారి వారసుల స్వాధీనంలో ఉంది. ఈ వ్యవహారంపై కోర్టులోనూ విచారణ జరిగిందని చెబుతున్నారు.

అభివృద్ధి పనులు సకాలంలో పూర్తిచేయాలి

-కలెక్టర్ సత్యప్రసాద్



అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న కలెక్టర్ సత్యప్రసాద్

జగిత్యాల, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): నిర్మాణంలో ఉన్న పనులు సకాలంలో పూర్తిచేయాలని కలెక్టర్ సత్యప్రసాద్ సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో ఫారెస్ట్, పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ శాఖ, రోడ్లు భవనాల శాఖ, నీటిపారుదల శాఖ అధికారులతో అభివృద్ధి పనుల నిర్వహణ తీరుపై సమీక్ష సమావేశం నిర్వహించారు. పంచాయతీరాజ్ శాఖకు మూడు రోడ్లు, ఆర్అండ్‌బీ శాఖకు చెందిన మూడు రోడ్లు, నీటిపారుదల శాఖకు మూడు ప్రాజెక్టులు, రోళ్లవాగు ప్రాజెక్టు, వర్రి వాగు ప్రాజెక్టులను పనులపై అటవీ శాఖ అధికారులతో సమన్వయం చేసుకొని సకాలంలో పూర్తిచేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ రాజాగౌడ్, జిల్లా ఫారెస్ట్ అధికారి రవిప్రసాద్, పీఆర్ ఈఈ లక్ష్మణరావు, ఆర్అండ్‌బీ ఈఈ శ్రీనివాస్, నీటి పారుదల శాఖ ఈఈ రమేష్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

విధుల్లో చేరిన నూతన ఎంపీవోలు

కోరుట్ల రూరల్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): గ్రూప్-2 ద్వారా ఎంపీవోగా రాజశేఖర్ కోరుట్ల మండల పంచాయితీ అధికారిగా గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఆయనను ఎంపీడీఓ రామకృష్ణ, సిబ్బంది సన్మానించారు.

●మల్యాల: మల్యాల ఎంపీవోగా బి.ఆమని బాధ్యతలు చేపట్టారు. ఆమెను ఎంపీడీవో స్వాతి, పంచాయితీ కార్యదర్శులు, కార్యాలయ ఉద్యోగ, సిబ్బంది అభినందించారు.

●బీర్‌పూర్: బీర్‌పూర్ ఎంపీవోగా మధుసుదన్, పర్యవేక్షకులుగా చంద్రశేఖర్ బాధ్యతలు స్వీకరించారు. ఎంపీడీవో భీమేష్ వీరిని సన్మానించారు.

●కొడిమ్యాల: కొడిమ్యాల ఎంపీవోగా భగవాన్‌రెడ్డి గురువారం బాధ్యతలను ఎంపీడీవో స్వరూప సమక్షంలో స్వీకరించారు. ఇప్పటి వరకు ఇన్‌చార్జి ఎంపీవోగా మండల పరిషత్ సూపరిండెంట్ సురేష్ బాధ్యతలను నిర్వర్తించారు.

ఆర్జితసేవల ధరల పెంపునకు బ్రేక్
-హర్షం వ్యక్తం చేస్తున్న అంజన్న భక్తులు
-ధరలు పెంచొద్దని కమిషనర్‌కు సూచించిన కేంద్ర మంత్రి
7

నత్తనడకన ధాన్యం కొనుగోళ్లు
-కొనుగోలు కేంద్రాల్లో పేరుకుపోతున్న ధాన్యం
-కేంద్రాల్లో రోజుల తరబడి రైతుల పడిగాపులు
8

సంచార జాతులకు ఇంటి స్థలాలు కేటాయించాలి

జగిత్యాల, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని కోరుట్ల నియోజకవర్గంలో గల సంచార జాతులకు చెందిన 'పెద్దమ్మలవాళ్ల'కు అవసరమైన ఇంటి స్థలాను కేటాయించాలని కోరుతూ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్, కలెక్టర్ సత్యప్రసాద్‌లకు సంచార జాతుల మహిళా సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు అనిత వినతి పత్రం అందించారు. గురువారం పట్టణంలోని సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో మంత్రి లక్ష్మణ్ కుమార్‌ను కలిసి సమస్యను విన్నవించారు. సంచార జాతుల కుటుంబాలకు నివాస పట్టాలు జారీ అయ్యే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలోని పోచమ్మల గల్లిలో సుమారు 19 సంచార కుటుంబాలు తాత్కలిక డేరాల కింద జీవిస్తున్నాయని విన్నవించారు. జీవనోపాదితో పాటు విద్య, నివాస గృహాలు లేక సంచార జాతుల కుటుంబాలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని గోడు వెల్లబోసుకున్నారు. ఇళ్ల కేటాయించినట్లయితే ఇతర ప్రాంతాలకు వెళ్లడం మానుకొని ఒకే చోట నివాసం ఉండడం సాధ్యమవుతుందని విన్నవించారు. ఈ కార్యక్రమంలో ఇబ్రహీంపట్నంకు చెందిన పలు సంచార జాతుల కుటుంబాల సభ్యులు పాల్గొన్నారు.

'బీసీ ఉద్యమాన్ని ఉధృతం చేస్తాం'



అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందిస్తున్న బీసీ నాయకులు

జగిత్యాల అగ్రికల్చర్, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): బీసీ బిల్లును కేంద్రప్రభుత్వం రాజ్యాంగ సవరణ చేసి, 9వ షెడ్యూల్‌లో చేర్పించాలనే డిమాండ్‌తో బీసీ ఉద్యమాన్ని రాష్ట్ర వ్యాప్తంగా ఉధృతం చేస్తామని బీసీ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు హరి అశోక్ కుమార్ అన్నారు. బీసీ సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని స్థానిక తహశీల్ చౌరస్తా వద్ద గల అంబేడ్కర్ విగ్రహం ఎదుట బీసీ బిల్లు అమలు చేయాలనే డిమాండ్‌తో నిరసన తెలిపారు. అనంతరం భారత రాజ్యాంగ నిర్మాత బాబాసాహెబ్ అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పించారు. అనంతరం హరి అశోక్‌కుమార్, చింతల గంగాధర్‌లు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి బీసీ రిజర్వేషన్‌లు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీసీ జేఏసీ బాధ్యులు చింతల గంగాధర్, గంగం జలజ, కస్తూరి శ్రీమంజరి, లక్ష్మీ, పెండెం గంగాధర్, గంగిపెల్లి వేణు మాధవ్, గుగ్గిల్ల సత్యనారాయణ, గాజుల శ్రీనివాస్, గాజుల నాగరాజు, అనుమల్ల స్మామ్రాట్, చేని తిరుపతి, రాపర్తి రవి, ఓరుగంటి భార్గవ్‌రాం, బింగి రాజేశం తదితరులున్నారు.

'సీనియర్ సిటిజన్లకు భరోసా కల్పిస్తాం'

జగిత్యాల అగ్రికల్చర్, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): సీనియర్ సిటిజన్లకు రాష్ట్ర ప్రభుత్వం భరోసా కల్పిస్తుందని మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో తెలంగాణ ప్రభుత్వం వయోవృద్ధుల పోషణ సంక్షేమ చట్టాన్ని సమర్థవంతంగా అమలు చేస్తుందని ఆయన అన్నారు. కలెక్టరేట్ కార్యాలయ సమావేశ మందిరంలో జిల్లా సంక్షేమ శాఖ ముద్రించిన వయోవృద్ధుల వారోత్సవాల పోస్టర్‌ను గురువారం మంత్రి చేతుల మీదుగా ఆయన ఆవిష్కరించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ వృద్ధ తల్లిదండ్రులను నిరాదరించే ప్రభుత్వ ఉద్యోగుల వేతనాల్లోంచి 15శాతం వరకు చెల్లించేలా ఉత్తర్వులు జారీ చేస్తామని చెప్పినట్లు ఆయన గుర్తు చేశారు. వయోవృద్ధుల కోసం పాటుపడుతున్న సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు హరి అశోక్‌కుమార్‌ను, వారి సంఘ ప్రతినిధులను మంత్రి అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్, ఎమ్మెల్యేలు డాక్టర్ సంజయ్, కల్వకుంట్ల సంజయ్, అదనపు కలెక్టర్‌లు బీఎస్ లత, రాజాగౌడ్, డీడబ్ల్యూవో భోనగిరి నరేష్ ఉన్నారు.

'కాంగ్రెస్ పాలనలో రైతులకు అన్యాయం'

కొడిమ్యాల, నవంబరు 13(ఆంధ్రజ్యోతి) : ధాన్యం సకాలంలో కొనుగోలు చేయక కాంగ్రెస్ ప్రభుత్వం అన్యాయం చేస్తోందని మల్యాల వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కోరండ్ల నరేందర్‌రెడ్డి అన్నారు. గురువారం మాజీ వైస్ చైర్మన్ కొడిమ్యాలలో విలేకరులతో మాట్లాడుతూ ప్రకృతి సహకరించక రైతులు ఒక వైపు నష్టపోగా కొనుగోలు కేంద్రాలకు తరలించిన ధాన్యం సకాలంలో తూకం వేయక రైతన్నలు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. వారం రోజులుగా కొనుగోలు కేంద్రాల నుండి మిల్లులకు తరలించిన ధాన్యాన్ని క్వింటాలుకు 3కిలోలు అదనంగా తీసుకోవాలని మిల్లర్లు చూస్తూ దిగుమతి చేసుకోవటంలో జాప్యం చేస్తున్నారని ఆరోపించారు. దీంతో రైతుల పరిస్థితి అగమ్య గోచరంగా తయారైందన్నారు. ఆయన వెంట బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు వెంకటేష్‌గౌడ్ ఉన్నారు.

ప్రతీ ధాన్యం గింజను కొనుగోలు చేయాలి

-ఎస్సీ, ఎస్టీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్



మాట్లాడుతున్న మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

జగిత్యాల, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): చివరి గింజ వరకు రైతుల వద్ద ధాన్యాన్ని కొనుగోలు చేయాలని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లాలో ధాన్యం కొనుగోలుకు సంబంధించి మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అధ్యక్షతన జగిత్యాల, కోరుట్ల ఎమ్మెల్యేలు డాక్టర్ మాకునూరి సంజయ్ కుమార్, డాక్టర్ కల్వకుంట్ల సంజయ్, జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్, అదనపు కలెక్టర్లు బీఎస్ లత, రాజ గౌడ్‌లతో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ ధాన్యం సేకరణలో ఇప్పటివరకు జగిత్యాల జిల్లాకు సంబంధించి ఎంత ధాన్యాన్ని సేకరించారు అని అడిగి తెలుసుకున్నారు. జిల్లాలో వరి సాగు మీదనే ఎక్కువగా రైతులు ఆధార పడ్డారని, వారికి ఎటువంటి సమస్యలు రాకుండా ప్రభుత్వం అన్ని విధాలుగా సహకరిస్తుందని తెలిపారు. గన్ని బ్యాగులు, టార్పలిన్ కవర్లు, మరియు వివిధ రకాల యంత్రాలు అందుబాటులో ఉండే విధంగా చూసుకోవాలని అధికారులను సూచించారు. అకాల వర్షాల వల్ల ధాన్యం తడిచిందని, తడిచిన ధాన్యాన్ని గంటలో ఆరబెట్టే మిషన్‌ను జగిత్యాల, కోరుట్ల, ధర్మపురికి సంబంధించి మూడు మిషన్లను కేటాయించామన్నారు. మరో ఏడు మిషన్ల కొరకు ప్రతిపాదనలు తయారు చేయాలని ఆదేశించారు.

రైతులు నిబంధనల ప్రకారం ధాన్యం తీసుకువచ్చి మద్దతు ధరను పొందాలని మంత్రి సూచించారు. ధాన్యం తూకం అయిన తర్వాత ధాన్యంకు సంబంధించి పూర్తి బాధ్యత ఆ సెంటర్ ఇంచార్జులు, అధికారులు తీసుకోవాలని తెలిపారు. ధాన్యం రవాణాకు సంబంధించి మిల్లర్ల దగ్గర వాహనం ఆగిపోతే రైతుల బాధ్యత కాదని, మిల్లర్ల బాధ్యత అని తెలిపారు. క్లస్టర్ అధికారులు, జిల్లా అధికారులు, ఆర్డీఓలు, అదనపు కలెక్టర్, రెవెన్యూ ప్రతి రోజు సెంటర్లను సందర్శించాలని, సెంటర్లలో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా ఎప్పటికప్పుడు సూచనలు చేస్తూ ధాన్యం కొనుగోలు సజావుగా జరిగేలా సమన్వయంతో పనిచేయాలని సూచించారు. అకాల వర్షాల వల్ల ధాన్యాన్ని కొనుగోలు చేయడం ఆలస్యం జరిగిందని, తడిచిన ధాన్యాన్ని, కలర్ మారిన ధాన్యాన్ని కొనుగోలు చేయడం జరుగుతుందని తెలిపారు. ధాన్యం కొనుగోలు సజావుగా జరిగే విధంగా అధికారులు, నిర్వాహకులు, మిల్లర్లు, రవాణా కాంట్రాక్టర్లు అందరూ సమన్వయంతో పనిచేయాలని కోరారు. ఈ సమావేశంలో ఆర్‌డీఓలు మధుసూదన్, శ్రీనివాస్, ట్రైని డిప్యూటీ కలెక్టర్ కన్నం హరిణి, వివిధ శాఖలకు సంబంధించిన అధికారులు పాల్గొన్నారు.

మంత్రి అడ్లూరికి సన్మానం

జగిత్యాల, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌ను గురువారం జిల్లా షెడ్యూల్డు కులాల అభివృద్ధి అధికారి రాజుకుమార్‌తో పాటు పలువురు ఉద్యోగులు ఘనంగా సన్మానించారు. ఇటీవల జిల్లా కేంద్రంలో పిడుగుపాటు కారణంగా గాయపడ్డ విద్యార్థి హిమేచంద్ర వైద్య ఖర్చులకు అవసరమైన రూ.18,18,842లను ప్రభుత్వం నుంచి కేటాయించడానికి కృషి చేయడాన్ని స్వాగతిస్తూ మంత్రి లక్ష్మణ్ కుమార్‌ను శాలువలతో సత్కరించారు. అదేవిధంగా విద్యార్థులు డైట్, కాస్మోటిక్, వసతి గృహ అద్దెలకు చెందిన చార్జీలు విడుదల చేయడం, అంబేద్కర్ ఓవర్సీస్ విద్యానిధి పథకం కింద విదేశాలలో పీజీ చదువుతున్న విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ. 20 లక్షల విడుదల చేయడం పట్ల కృతజ్ఞతలు తెలిపారు. ఈకార్యక్రమంలో కార్యాలయ సూపరిండెంట్ జావిద్ ఇక్బాల్, సహాయ సాంఘిక సంక్షేమ అధికారి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

పెగడపల్లి, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పెగడపల్లి ఎస్‌ఐ ఇ.కిరణ్‌కుమార్ పేర్కొన్నారు. గురువారం పెగడపల్లి బస్టాండ్ ఆవరణలో సైబర్ నేరాల పట్ల ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ మొబైల్ ఫోన్ ద్వారా వచ్చే అనవసరమైన లింక్‌లు ఓపెన్ చేయకూడదన్నారు.

అపరిచితుల నుంచి వచ్చే ఫోన్ కాల్స్‌కు బ్యాంక్ ఖాతా వివరాలు, ఆధార్ నెంబరు, ఓటీపీలు చెప్పకూడదని పెగడపల్లి ఎస్‌ఐ సూచించారు. ఎవరైనా అనుకోకుండా సైబర్ మోసాలకు గురైతే వెంటనే 1930 కు కాల్ చేసి ఫిర్యాదు చేయాలన్నారు. అలాగే మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలని ఆయన సూచించారు. మత్తు పదార్థాలకు వ్యసనపరులుగా మారి జీవితాలు నాశనం చేసుకోకూడదన్నారు. ఈఅవగాహన సదస్సులో పలువురు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

న్యాయవాదుల విధుల బహిష్కరణ



కోరుట్లలో విధుల బహిష్కరించి నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

కోరుట్ల, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : నిర్మల్ జిల్లా కేంద్రంలో న్యాయవాదిపై దాడిని ఖండిస్తూ గురువారం కోరుట్ల న్యాయవాదులు విధులు బహిష్కరించి, కోర్టు ఆవరణ ముందు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బైరి విజయ్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో అడ్వకేట్ ప్రొటెక్షన్ యాక్టును వెంటనే అమలు చేయాలని అన్నారు. భవిష్యత్తులో దాడులు జరకుండా ప్రభుత్వాలు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఢిల్లీలో జరిగిన ఉగ్రదాడిలో మృతి చెందిన అమరులకు ఘన నివాళిని అర్పించారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ సభ్యులు కొంపల్లి సురేష్, చిలివేరి రాజశేఖర్, ఫసియోద్దీన్, సుతారి నవీన్ కుమార్, కడకుంట్ల సదాశివరాజు, గోనే సదానంద్ నేత, చాప వందన, రాసభక్తుల రాజశేఖర్, ఉరిడి నరేందర్, మరిపల్లి గంగాధర్, కిశోర్, కోలుగూరి శ్రీపతిరావు పాల్గొన్నారు.

●మెట్‌పల్లి టౌన్: పట్టణంలో న్యాయవాదులు విధులు బహిష్కరించి, కోర్టు ఆవరణ ముందు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మోహన్ రెడ్డి మాట్లాడుతూ నిర్మల్ జిల్లాలో న్యాయవాదిపై దాడి చేయడంతోపాటు అతని కారును ధ్వంసం చేసిన పోలీసులపై చర్యలు తీసుకోవాలని వారు చేశారు. కార్యక్రమంలో న్యాయవాదులు కోటగిరి వెంకటస్వామి, రాజేశ్వర్‌తోపాటు పలువురు పాల్గొన్నారు.

●ధర్మపురి: ధర్మపురి జూనియర్ సివిల్ కోర్టులో న్యాయవాదులు గురువారం విధులు బహిష్కరించారు. అనంతరం ధర్మపురి బార్ అసోసియేషన్ అధ్యక్షులు అలుక వినోద్‌కుమార్ మాట్లాడుతూ న్యాయవాది అనిల్‌కుమార్‌పై దౌర్జన్యం చేసిన ఎస్‌ఐ, పోలీస్ సిబ్బందిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని కోరారు. ఇలాంటి సంఘటనలు జరుగకుండా నిర్మల్ జిల్లా ఎస్పీ వెంటనే చర్యలు తీసుకోవాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ మామిడాల శ్రీకాంత్‌కుమార్, న్యాయవాదులు రౌతు రాజేష్, బందెల రమేష్, జాజాల రమేష్, గూడ జితేందర్‌రెడ్డి, కస్తూరి శరత్, సుంకే రాజు, కలమడుగు కీర్తి తదితరులు పాల్గొన్నారు.

విదేశీ ఉద్యోగ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి

-జిల్లా ఉపాధి కల్పన అధికారి సత్యమ్మ



మాట్లాడుతున్న జిల్లా ఉపాధి కల్పనా అధికారి సత్యమ్మ

జగిత్యాల అగ్రికల్చర్, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్‌పవర్ కంపెనీ లిమిటెడ్ (టామ్‌కామ్) ఆధ్వర్యంలో కల్పిస్తున్న విదేశీ ఉద్యోగ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఉపాధి కల్పన అధికారి సత్యమ్మ అన్నారు. జగిత్యాల జిల్లా కేంద్రంలోని స్థానిక శుభమస్తు ఫంక్షన్ హాల్‌లో ఇజ్రాయిల్ దేశంలో నిర్మాణరంగ ఉద్యోగాల కోసం నిర్వహించిన డ్రైవ్‌కు సుమారు 620మంది నిరుద్యోగులు తమ పేర్లను నమోదు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇజ్రాయెల్‌లో నిర్మాణ రంగంలో గల జిప్సం వర్కర్స్, సిరామిక్ టైలింగ్, ప్లాస్టరింగ్ మరియు బ్లాక్ బిల్డర్స్ ఉద్యోగాల కోసం నిర్వహించిన ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్‌కు విశేష స్పందన వచ్చిందన్నారు. టామ్‌కామ్ పూర్తిగా ప్రభుత్వ ఆధ్వర్యంలో నడుస్తున్న సంస్థ అని అన్నారు. టామ్‌కామ్‌లో నమోదు అయిన అభ్యర్థులకు ఏ దేశంలో ఖాళీలు ఉన్నా వారి అర్హతలను బట్టి కాల్ చేసి తెలియజేస్తాన్నారు. కార్యక్రమంలో టామ్‌కామ్ అధికారులు, ఉపాధి కల్పనా కార్యాలయ సిబ్బంది తదితరులున్నారు.

రేపు ప్రైవేట్ రంగంలో ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు

జిల్లాలోని నిరుద్యోగ యువతీ, యువకులకు ప్రైవేట్ రంగంలో ఉద్యోగాలు కల్పించుటకు శనివారం జిల్లా ఉపాధి కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని జిల్లా ఉపాధి కల్పనా అధికారి సత్యమ్మ తెలిపారు. అపోలో హోమ్‌కేర్ హైదరాబాద్ సంస్థలో 50మంది, కృషి విజ్ఞాన్ హైదరాబాద్ సంస్థలో 67మంది ఖాళీల కోసం ఈ ఇంటర్వ్యూలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఇట్టి ఉద్యోగాలకు ఇంటర్,డిగ్రీ, ఎంబీఏ, బీఎస్సీ నర్సింగ్ , ఏఎన్ఎం, జీఎన్ఎం, ఎంపీహెచ్‌డబ్ల్యూ పట్టా కలిగిన వారు అర్హులన్నారు. ఉదయం 10.30గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు జరిగే జాబ్‌మేళాకు సంబంధించిన ధ్రువపత్రాలతో జిల్లా ఉపాధి కల్పనా కార్యాలయానికి రావాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

మల్యాల, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని ముత్యం పేట విద్యుత్ ఫీడర్ నందు శుక్రవారం చెట్ల కొమ్మలు తొలగించడం, మరమ్మత్తులు జరుగనున్న దృష్ట్యా విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనున్నట్లు ట్రాన్స్‌కో అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8.30గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు మల్యాల సబ్‌స్టేషన్ పరిదిలోని ముత్యంపేట, గుడిపేట గ్రామాల పరిధిలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని అన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం


ఈశ్వరయ్య(ఫైల్)

కరీంనగర్ క్రైం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ శివారులోని పద్మనగర్ బైపాస్ రోడ్డు జంక్షన్ సమీపంలో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో కొత్తపల్లి మండలం చింతకుంట రాజీవ్‌నగర్‌లో నివాసం ఉంటున్న కొడిమ్యాల మండలం రాముని పల్లికి చెందిన గడ్డం ఈశ్వరయ్య(34) దుర్మరణం చెందాడు. పెయింట్ కాంట్రాక్టర్‌గా పనిచేస్తున్న ఈశ్వరయ్య ఉదయం 10 గంటల సమయంలో చింతకుంట నుంచి స్నేహితుడు చిరంజీవితో కలిసి కోతిరాంపూర్‌కు ద్విచక్రవాహనంపై వెళుతుండగా వెనుక నుంచి లారీ ఓవర్‌టేక్ చేస్తూ ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టింది. దీంతో ఈశ్వరయ్య రోడ్డుపై పడగా అతని పైనుంచి లారీ వెళ్లటంతో తీవ్రంగా గాయపడ్డాడు. ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు వెల్లడించారు. చిరంజీవికి కూడా గాయాలయ్యాయి. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని టూటౌన్ పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి

సుల్తానాబాద్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కాట్నపల్లి, గర్రెపల్లి గ్రామాల మధ్య జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఇద్దరిలో ఒకరు చికిత్స పొందుతూ మృతి చెందారు. బుధవారం రాత్రి రాజీవ్ రహదారిపై ప్రమాదం జరుగగా ఇద్దరు వ్యక్తులు గాయపడ్డారు. వీరిలో పెద్దపల్లి పట్టణం భూంనగర్‌కు చెందిన భాను విజయానంద్ అనే వ్యక్తి తీవ్రంగా గాయపడి మెరుగైన చికిత్స కోసం కరీంనగర్‌కు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందారు. కుమారుడి వివాహ పత్రికలను బంధువులకు పంచడానికి వెళ్లి వస్తుండగా ప్రమాదం జరిగిందని తెలిపారు. మృతుడు మంచిర్యాలలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల అడ్మినిస్ట్రేటర్ ఆఫీసర్‌గా పనిచేస్తున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

ద్విచక్రవాహనాన్ని ఢీకొన్న ఆర్టీసీ బస్సు

- ఇద్దరికి తీవ్రగాయాలు

రుద్రంగి, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం శివారులోని మానాల ఎక్స్‌రోడ్డు వద్ద గురువారం ఉదయం ద్విచక్ర వాహనాన్ని ఆర్టీసీ బస్సు ఢీకొన్న ఘటనలో ఇద్దరికి తీవ్రగాయాలు అయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. రుద్రంగి శివారులోని కోరుట్ల-వేములవాడ ప్రధాన రహదారిలోని మానాల ఎక్స్‌రోడ్డు వద్ద ఆగి ఉన్న ద్విచక్ర వాహనాన్ని టీఎస్ 23 టీ 4536 నంబర్‌గల ఆర్టీసీ బస్సు వెనుక నుంచి ఢీకొట్టింది. దీంతో బైక్‌పైన ఉన్న రుద్రంగికి చెందిన బీమనాతి మురళి అనే వ్యక్తితోపాటు ప్రభుత్వ ఉపాధ్యాయురాలికి తీవ్రగాయాలు కావడంతో వేములవాడలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. మురళి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ శ్రీనివాస్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

డిజిటల్ చెల్లింపులకే ప్రాధాన్యం



- ఆన్‌లైన్‌లోనే విద్యుత్ బిల్లుల చెల్లింపులు
- క్యూలో నిలుచునే బాధ తప్పిందంటున్న వినియోగదారులు

గణేశ్‌నగర్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ బిల్లు చెల్లించేందుకు ఇది వరకు ఎన్‌పీడీసీఎల్ బిల్లుల కేంద్రాల వద్ద వినియోగదారులు బారులు తీరేవారు. గడువు తేదీ వస్తే ఒక్కోసారి గంటల తరబడి నిలుచుకోవాల్సిన పరిస్థితి ఉండేది. ప్రస్తుతం పరిస్థితి మారింది. చాలా మంది డిజిటల్ చెల్లింపులకే ప్రాధాన్యం ఇస్తున్నారు. విద్యుత్ అధికారులు డిజిటల్ చెల్లింపులపై వినియోగదారులకు అవగాహన కల్పిస్తున్నారు. వినియోగదారుల సౌలభ్యం కోసం నార్తర్న్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ లిమిటెడ్ (టీజీఎన్‌పీడీసీఎల్) డిజిటల్ చెల్లింపుల విధానాన్ని విస్తృతంగా అందుబాటులోకి తీసుకొచ్చింది. ప్రతి ఏటా 10 శాతం విద్యుత్ వినియోగదారులు తమ తమ నెల వారి విద్యుత్ బిల్లులను టీజీఎన్‌పీడీసీఎల్ యాప్, టి వ్యాలెట్, గూగుల్ పే, ఫోన్ పే, పేటీఎం వంటి డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌ల ద్వారా చెల్లిస్తున్నారు. గత ఏడాది 2024 సంవత్సరంలో 10,93,689 వినియోగదారులు ఆన్‌లైన్ ద్వారా చెల్లింపు చేయగా ఈ ఏడాది నవంబర్ 11 వరకు 14,66,588 మంది వినియోగదారులు చెల్లించారు.

● అవగాహన అవసరం..

నగరం, పట్టణాలు, మండల కేంద్రాల్లో చదువుకున్న వారు మాత్రమే డిజిటల్ చెల్లింపులు చేస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఈ సంఖ్య తక్కువగా ఉంది. ఆయా చోట్ల వినియోగదారులకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది. గ్రామాల్లో డిజిటల్ చెల్లింపులు 30 శాతం కూడా దాటట్లేదు. బిల్లు జారీ చేసిన పదిహేను రోజుల్లో చెల్లించాలి. లేకపోతే 75 నుంచి 150 రూపాయల వరకు జరిమానా రూపంలో కట్టాల్సి ఉంటుంది. డిజిటల్ చెల్లింపులు చేస్తే చివరి తేదీపై నోటిఫికేషన్లు వస్తుంటాయి. కొన్ని ప్లాట్‌ఫారాల్లో ఆటో పే ఆప్షన్ కూడా ఉంది. కార్యాలయ కౌంటర్లకు వెళ్లాల్సిన అవసరం లేకుండా ఎక్కడి నుంచైనా నిమిషాల వ్యవధిలో చెల్లించవచ్చు. చెల్లించిన తర్వాత వెంటనే లావాదేవీ నమోదవుతుంది.

ఆన్‌లైన్ ద్వారా విద్యుత్ బిల్లుల చెల్లింపు సులభం

- మేక రమేష్‌బాబు, టీజీఎన్‌పీడీసీఎల్ ఎస్ఈ



విద్యుత్ వినియోగదారులు తమ ఆండ్రాయిడ్ మొబైల్ ఫోన్‌లోని ప్లే స్టోర్ లో టీజీఎన్‌పీడీసీఎల్ అని టైప్ చేసి డౌన్‌లోడ్ చేసుకోవాలి. అందులో విద్యుత్ బిల్లు పై ఉన్న యుఎస్సీ నంబర్ నమోదు చేసుకుని విద్యుత్ బిల్లు చెల్లించవచ్చు. ఈ విధానంలో బిల్లు రాగానే నోటిఫికేషన్ వస్తుంది. టీజీఎన్‌పీడీసీఎల్ వినియోగదారులకు మరింత నాణ్యమైన సేవలు అందించడంలో భాగంగా బిల్లుల చెల్లింపును సులభతరం చేసింది. వినియోగదారులు బిల్లులను డిజిటల్ రూపంలో చెల్లించి సమయాన్ని ఆదా చేసుకోవాలి.

పార్లమెంట్‌లో రాజ్యాంగ సవరణ చేయాలి

బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు ఆది మల్లేశం


ధర్మపోరాట దీక్షలో నినాదాలు చేస్తున్న బీసీ సంక్షేమ సంఘం నాయకులు

సుభాష్‌నగర్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): బీసీలకు 42 శాతం రిజర్వేషన్ పెంచడానికి పార్లమెంట్‌లో రాజ్యాంగ సవరణ చేయాలని బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు ఆది మల్లేశం, జిల్లా అధ్యక్షుడు నాగుల కనకయ్య అన్నారు. గురువారం బీసీ జేఏసీ నాయకుడు దొగ్గలి శ్రీధర్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్మపోరాట దీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించేందుకు పార్లమెంట్‌లో రాజ్యాంగ సవరణ చేసి తొమ్మిదవ షెడ్యూల్‌లో చేర్చాలని డిమాండ్ చేశారు. మేమెంతో మాకంత వాటాలు కావాలని కోరారు.

కేంద్రంపై ఒత్తిడి చేసేందుకు వివిధ రూపాల్లో కార్యక్రమాలు చేపడుతున్నామని, అందులో భాగంగానే ఈ దీక్షతోపాటు ఈనెల 16న రన్ ఫర్ సోషల్ జస్టిస్, 18న ఎంపీలతో ములాకాత్, 23న అఖిలపక్ష సమావేశాలు నిర్వహిస్తామని తెలిపారు. డిసెంబరు మొదటి వారంలో పార్లమెంట్ ముట్టడి కార్యక్రమాన్ని తలపెట్టినట్లు తెలిపారు. ఈదీక్షకు తెలంగాణ జాగృతి అధ్యక్షుడు గుంజపడుగు హరిప్రసాద్ సంఘీబావం తెలిపారు. ఈ దీక్షలో బీసీ జేఏసీ నాయకులు జీఎస్ ఆనంద్, దేవరకొండ సంతోషి లక్ష్మి, మంతెన కిరణ్, వాయిల రాజ్‌కుమార్, గుమ్మడి శ్రీనివాస్, అశిష్, బియ్యని తిరుపతి, రవీంద్రాచారి, రామ్మూర్తి, నితిన్, తదితరులు పాల్గొన్నారు.

సంపులో పడిన ఆవు.. రక్షించిన ఫైర్ సిబ్బంది

కరీంనగర్ క్రైం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ కలెక్టరేట్‌లోని ఒక నీటి సంపులో పడిన ఆవును కరీంనగర్ ఫైర్ సిబ్బంది రక్షించారు. గురువారం ఉదయం ఒక ఆవు కలెక్టరేట్ క్యాంటిన్ వద్ద ఉన్న నీటి సంపులో ప్రమాదవశాత్తు పడిపోయింది. సమాచారం అందడంతో కరీంనగర్ ఫైర్ స్టేషన్ సిబ్బంది అక్కడికి వెళ్లి ఆవును క్షేమంగా బయటకు తీశారు.

విషాహారం తిని గొర్రెలు మృతి

ధర్మారం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): విషాహారం తిని 10 గొర్రెలు మృతి చెందిన ఘటన మండలంలోని కటికెనపల్లిలో చోటు చేసుకుంది. కటికెనపల్లి గ్రా మానికి చెందిన ఆవుల మల్లేశంనకు 30 గొర్రెల వరకు ఉండగా వాటిని మేపేందుకు శివారులోని ఊర చెరువు సమీపంలోకి వెళ్లారు. బుధవారం సాయంత్రం మేత మేసిన గొర్రెలు ఇంటికి వచ్చే సమయంలో అప్పుడే కోసిన పొలంలో విషాహారం తిని అస్వస్థతకు గురయ్యాయి. గురువారం ఉద యం ప్రాణాపాయస్థితిలో ఉన్న గొర్రెలకు చికిత్స అందించేలోపే 10 గొర్రెలు మృత్యువాత పడ్డాయని మిగత గొర్రెలు తీవ్ర అస్వస్థతతో ఉన్నాయని యజమాని మల్లేశం తెలిపారు. గొర్రెల మృతితో ఆర్థికంగా నష్టపోయిన తన కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

వృద్ధురాలి ఆత్మహత్య

ఓదెల, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో పురుగుల మందు త్రాగి రామినేని కనకమ్మ (67) అనే వృద్ధురాలు ఆత్మహత్య చేసుకుంది. మతిస్థిమితం సరిగాలేక జీవితంపై విరక్తి చెంది, బుధవారం తన ఇంటిలో ఎవరు లేని సమయంలో పురుగుమందు తాగింది. కుమారుడు గమనించి కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు. ఇక్కడ చికిత్స పొందుతూ గురువారం మృతి చెందింది. మృతురాలి కుమారుడు రామినేని కుమారస్వామి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పొత్కపల్లి పోలీసులు తెలిపారు.

కాపర్ తీగ చోరీ

వీణవంక, నవంబరు13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దేశాయిపల్లి పరిధిలోని ఐలాబాద్ గ్రామ శివారులో వ్యవసాయ భూమిలో గల 25కెవీఏ ట్రాన్స్‌ఫార్మర్‌లోని కాపర్‌వైర్‌ను గుర్తు తెలియని నిందితులు ఎత్తుకెళ్లినట్లు చల్లూరు ఏఈ కాంతామళ్ల శ్రీనివాస్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ వెంకటొరెడ్డి తెలిపారు.

మ్యాథ్స్ టాలెంట్ టెస్టులో సత్తాచాటిన విద్యార్థులు


లాస్యను మెమోంటోతో అభినందిస్తున్న అధ్యక్షుడు బాల్‌రాజు

సిరిసిల్ల టౌన్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): సదిశ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మూడు రాష్ట్రాల పరిధిలో నిర్వహించిన మ్యాథ్స్ టాలెంట్ టెస్టులో సిరిసిల్ల పట్టణ విద్యార్థులు సత్తా చాటారు. గురువారం ప్రతిభ చాటిన విద్యార్థులను ఆయా పాఠశాలలో మెమోంటోలతో విద్యార్థులను అభినందించారు. సిరిసిల్ల నెహ్రూనగర్‌కు జిల్లా పరిషత్ హైస్కూల్‌కు చెందిన సాకేత్, ఆడెపు లిఖిత్‌లను ప్రధానోపాధ్యాయురాలు నాగుల భాగ్యరేఖ, ఉపాధ్యాయులు అభినందించారు.

సిరిసిల్ల అంబేద్కర్‌నగర్ జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థిని యెన్నం లాస్య టాలెంట్ టెస్టులో అత్యుత్తమ ప్రతిభను కనబరచగా కాంగ్రెస్ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఆకునూరి బాలరాజు, ప్రధానోపాధ్యాయురాలు ఎన్ రమాదేవి, ఉపాధ్యాయులు మెమోంటోను అందించి అభినందించారు.


విద్యార్థులు సాకేత్, లిఖిత్

గ్యాస్ సిలిండర్ లీకై చెలరేగిన మంటలు

ఎల్లారెడ్డిపేట, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దుమాలకు చెందిన మహేందర్‌రెడ్డి ఇంటిలో గురువారం గ్యాస్ సిలిండర్ లీకై మంటలు చెలరేగాయి. భారీ మంటలు ఎగిసిపడడంతో వంట గదిలోని తినుబండారాలు, వస్తువులు కాలిపోయాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది సకాలంలో చేరుకుని మంటలను ఆర్పివేశారు. ఘటనలో సుమారు రూ.3 లక్షల నష్టం వాటిల్లిందని బాధితుడు పేర్కొన్నారు. మహేందర్‌రెడ్డి ఇంటికి తాళం వేసి తన కుటుంబ సభ్యులతో కలిసి ఓ శుభకార్యానికి వెళ్లాడు. ఇంట్లోని వంట గది నుంచి పొగలు, మంటలు రావడం గమనించిన చుట్టుపక్కల వారు ఆయనకు సమాచారం అందించారు.


కాలిపోయిన వంట గది

ఇంటికి చేరుకున్న మహేందర్‌రెడ్డి తాళం తీసి చూసే సరికి మంటలు వ్యాపిస్తున్నాయి. అగ్నిమాపక సిబ్బంది, చుట్టు పక్కల వారి సహాయంతో కలిసి మంటలను అదుపులోకి తీసుకువచ్చారు.

ఐదుగురిపై కేసు నమోదు

కరీంనగర్ క్రైం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ మండలంలోని సీతారాంపూర్‌కు చెందిన భూవివాదంలో ఐదుగురిపై కేసు నమోదైనట్లు పోలీసులు తెలిపారు. పోలీసులు, బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. సీతారాంపూర్‌కు చెందిన కాసర్ల హన్మంతుకు కొట్టె తిరుపతి, కొట్టె శంకర్, కొట్టె వెంకటేశం, కొట్టె అశోక్, కొట్టె సుధాకర్‌ల మధ్య భూ వివాదం ఉంది. బుధవారం రాత్రి కాసర్ల హన్మంతు భూమిలోకి ప్రవేశించిన ఐదుగురు ప్రహరీ కూల్చివేసినట్లు గురువారం వారిని అడుగగా భూమి తమని చంపుతామని బెదిరించినట్లు బాధితుడు కొత్తపల్లి పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు సీఐ బిల్ల కోటేశ్వర్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

ముత్తారం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): తాడిచర్ల ఓసీపీలో కాంట్రాక్టు సెక్యూరిటీ గార్డులుగా విధులు నిర్వహిస్తున్న ముత్తారం మండలానికి చెందిన ఇద్దరు రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు. మండలంలోని కేశనపల్లికి చెందిన రాంపల్లి శ్రీధర్, మదుకర్‌గౌడ్ తాడిచర్ల ఓసీపీలో విధులు ముగించుకొని ద్విచక్ర వాహనంపై ఇంటికి బుధవారం వెళ్తున్నారు. ఈ క్రమంలో ఒక్కసారిగా అడవి పందులు అడ్డువచ్చి వాహనాన్ని ఢీకొన్నాయి. దీంతో వారు కింద పడి గాయాలపాలయ్యారు. గమనించిన స్థానికులు ముత్తారం ఆర్‌పీఎం వద్ద ప్రథమ చికిత్స అనంతరం కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

కరీంనగర్ క్రైం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుకను అక్రమంగా తరలిస్తుం డగా రెండు ట్రాక్టర్లను గురువారం పట్టుకున్నామని కరీంనగర్ రూరల్ సీఐ ఏ నిరంజన్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. కరీంనగర్ రూరల్ మండలం తీగలగుట్టపల్లిలోని రైల్వేగేట్ వద్ద ఒకటి, బొమ్మకల్ ఫ్లైఓవర్ వద్ద మరొక ఇసుక లోడ్‌తో వెళుతున్న ట్రాక్టర్లను పట్టుకున్నామని తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

వీణవంక: మండలంలోని కోర్కల్ గ్రామంలోని మానేరు వాగు నుంచి ఇసుకను అక్రమంగా రవాణా చేస్తున్న ట్రాక్టర్‌ను పోలీసులు గురువారం పట్టుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఇసుక రవాణా చేస్తున్న వారిపై కేసు నమోదు చేసినట్టు ఏఎస్సై వెంకట్‌రెడ్డి తెలిపారు.

శంకరపట్నం: అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు ఎస్ఐ శేఖర్‌రెడ్డి తెలిపారు. వీణవంక మండలం చల్లూరు గ్రామానికి చెందిన గుడెపు బాలకృష్ణ ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక రవాణా చేస్తుండగా కేశవపట్నం శివారులో పట్టుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ప్రపంచ వ్యవసాయ సదస్సులో కోనరావుపేట రైతులు

కోనరావుపేట, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): జర్మనీలో జరుగుతున్న అంతర్జాతీయ వ్యవసాయ సదస్సులో రాజన్న సిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండలం మామిడిపల్లి గ్రామానికి చెందిన కాతుబండ శ్రీనివాస్, కాటిపల్లి వేణుగోపాల్‌రెడ్డి, నాగారం గ్రామానికి చెందిన ధూమ్‌పేట నాగరాజు గురువారం పాల్గొన్నారు. సదస్సులో ఆధునిక వ్యవసాయ సాంకేతికతలు సుస్థిర సాగు విధానాల్లో వస్తున్న విప్లవాత్మక మార్పులు ఆవిష్కరణలపై ప్రపంచవ్యాప్తంగా ఉన్న నిపుణులు, మార్గదర్శకులు సదస్సులో చర్చించినట్లు రైతు దూంపేట నాగరాజు తెలిపారు. ఈ సదస్సులో ధూంపేట్ నాగరాజు వ్యవసాయంపై జరిగిన చర్చల్లో పాల్గొని రాష్ట్రంలో రైతులు చేస్తున్న వ్యవసాయ సాగుపై వివరించారు. రాష్ట్రంలో వ్యవసాయ ఖర్చులు పెరుగుతున్నాయని, అక్కడి రైతులు ఫర్టిలైజర్ క్రిమిసంహారక మందులు ఎక్కువ వాడుతున్నారని, తక్కువ ఖర్చుతో ఎక్కువ దిగుబడి ఇచ్చే సాంకేతిక పరిజ్ఞానం అందించాలని కోరారు. ఈ సదస్సులో వెదర్ స్టేషన్ల ద్వారా డేటా సేకరణ, నేల నాణ్యత విశ్లేషణ, స్మార్ట్ అగ్రికల్చర్, టెక్నాలజీ వంటి అంశాలలో ప్రాక్టికల్‌గా జర్మనీ వ్యవసాయ నిపుణులకు చూపించామని తెలిపారు. ఈ సదస్సులో తెలంగాణ అగ్రికల్చర్ శాఖ, అక్రర్డ్ ప్రాజెక్టు అధికారులు నాగరాజు ప్రతిభను ప్రశంసిస్తూ అభినందించినట్లు తెలిపారు.


తెలంగాణలో చేస్తున్న వ్యవసాయంపై జర్మనీ నిపుణులకు వివరిస్తున్న నాగరాజు

పెద్దబొంకూర్‌లో చోరీ

పెద్దపల్లి రూరల్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దబొంకూర్‌లో బుధవారం రాత్రి దొంగలు హల్‌చల్ చేశారు. గ్రామానికి చెందిన వేముల రమేష్ బుధవారం ఇంటికి తాళం వేసి కూతురు ఇంటికి వెళ్లాడు. గురువారం సాయంత్రం ఇంటికి వచ్చి చూసే సరికి ఇంటి గేట్ తాళం వేసి ఉండగా తలుపునకు ఉన్న తాళం పగలగొట్టి ఉండటంతో బాధితుడు రమేష్ 100కు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి పెద్దపల్లి రూరల్ పోలీసులు చేరుకొని పరిశీలించగా ఇంట్లో రెండు బీరువా తాళాలు పగలగొట్టడంతో పాటు, బట్టలు చిందరవందరగా పడి ఉన్నాయి. బీరువాలోని అరతులం బంగారం, ఐదు వేల రూపాయల నగదు ఎత్తుకెళ్లినట్లు బాధితుడు తెలిపారు. ముగ్గురు వ్యక్తులు సంచరిస్తున్న సీసీ ఫుటేజి సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

ముగిసిన ఎంజేపీ పాఠశాలల ఉమ్మడి జిల్లా స్పోర్ట్స్ మీట్



తిమ్మాపూర్‌లోని ఎంజేపీలో విజేతలకు బహుమతులను ప్రదానం చేస్తున్న సీఐ సదన్‌కుమార్, సుల్తానాబాద్‌లో అతిథులు..

తిమ్మాపూర్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): తిమ్మాపూర్ మండల కేంద్రంలోని మహాత్మా జ్యోతిబా పూలే తెలంగాణ సంక్షేమ గురుకుల విద్యా సంస్థల సొసైటీ ఆధ్వర్యంలో ఈ నెల 11న ప్రారంభమైన సీనియర్, జూనియర్ బాలికల ఉమ్మడి కరీంనగర్ జిల్లా స్థాయి పోటీలు గురువారం ముగిశాయి. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని అండర్ -14, అండర్-19 అంశాలలో 15 ఎంజేపీ పాఠశాలలు, 15 క్రీడాంశాలలో 636మంది విద్యార్థులు పాల్గొన్నారు. ముగింపు కార్యక్రమానికి తిమ్మాపూర్ సీఐ సదన్‌కుమార్ ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. గెలుపు, ఓటములు సమానంగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్‌సివో అంజలి, ప్రిన్సిపాల్స్ సరిత, సృజన, విమల, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

● విజేతలుగా సుల్తానాబాద్, బీర్పూర్ జట్టు

సుల్తానాబాద్: ఉమ్మడి కరీంనగర్ జిల్లా స్థాయి అండర్ 14, 19 విభాగంలో నిర్వహించిన క్రీడా పోటీల్లో సుల్తానాబాద్, జగిత్యాల జిల్లా బీర్పూర్ జట్టు ఓవరాల్ చాంపియన్ షిప్ సాధించి, విజేతగా నిలిచాయి. మండలంలోని భూపతిపూర్‌లోని జ్యోతిరావుపూలే గురుకులంలో మూడు రోజులుగా జరుగుతున్న ఈ పోటీలు గురువారం రాత్రి ముగిశాయి. విజేతలకు ముఖ్యఅతిథిగా రామగుండం గురుకుల విద్యాలయ ప్రిన్సిపాల్ శిరీష చేతుల మీదుగా బహుమతులు పంపిణీ చేశారు. ఈ పోటీల్లో ఉమ్మడి జిల్లాలోని 14 పాఠశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు. ఇందులో ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, టెన్నికాయిట్, అథ్లెటిక్స్ పోటీలు జరిగాయి. సుల్తానాబాద్ జట్టు అండర్ 19 విభాగంలో ఓవరాల్ చాంపియన్ షిప్‌తోపాటు వ్యక్తిగత చాంపియన్ షిప్‌ను అంజి గెలుచుకున్నారు. అలాగే అండర్ 14లో ఓవరాల్‌గా బీర్పూర్ జట్టు సాధించగా, విజయ్ వ్యక్తిగత చాంపియన్‌గా నిలిచాడు. ఈ కార్యక్రమంలో బూరుగుపల్లి ప్రిన్సిపాల్ జయసింగ్, సుల్తానాబాద్ ప్రిన్సిపాల్ శ్రీనివాస్, వైస్‌ప్రిన్సిపాల్ సురేష్, సంక్షేమ అధికారి సంధ్యారాణి తదితరులు పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి

మెట్‌పల్లిటౌన్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): మెట్‌పల్లి పట్టణంలోని టీచర్స్ కాలనీలో గురువారం అనుమానాస్పద స్థితిలో ఇబ్రహీంపట్నం గ్రామానికి చెందిన బగ్గాల లక్ష్మి అలియాస్ నేరెళ్ల రాజగంగు(50) మృతిచెందింది. మెట్‌పల్లి ఎస్ఐ కిరణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. ఇబ్రహీంపట్నం గ్రామానికి చెందిన లక్ష్మికి ఇద్దరు కూతుళ్లు కాగా పెళ్లిలు చేసిన అనంతరం భర్తతో విడిపోయి మెట్‌పల్లి పట్టణంలో ఒంటరిగా నివాసం ఉంటోంది. లక్ష్మి కొంతకాలంగా కాలేయ వ్యాధితో బాధపడుతోంది.

బుధవారం ఆమె ఇంటి నుంచి దుర్వాసన రావడంతో స్థానికులు ఆమె చిన్నకూతురు అనూషకు సమాచారం ఇచ్చారు. ఆమె ఇంటికి వచ్చి చూసే సరికి మంచంపై లక్ష్మి మృతదేహం నగ్నంగా ఉన్నట్లు తెలిపారు. లక్ష్మి మృతిపై అనుమానం వ్యక్తం చేస్తూ చిన్న కూతురు అనూష ఇచ్చిన ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతి కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్లు ఎస్ఐ కిరణ్‌కుమార్ వివరించారు.

రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపిక

సిరిసిల్ల టౌన్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రానికి చెందిన విద్యార్థి ధనుష్ ఎస్‌జీఎఫ్ రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపికయ్యాడు. సిరిసిల్ల పట్టణం జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలకు చెందిన ధనుష్ ఎస్‌జీఎఫ్ రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపిక కావడంతో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శారద, వ్యాయామ ఉపాధ్యాయుడు తడక సురేష్, ఉపాధ్యాయులు గురువారం మెమోంటోతో అభినందించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయురాలు శారద మాట్లాడుతూ శుక్రవారం, శనివారం నల్గొండ జిల్లా కేంద్రంలోని డాన్ బాస్కో అకాడమిలో జరగనున్న ఎస్‌జీఎఫ్ రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీల్లో ధనుష్ పాల్గొంటారని అన్నారు.


ధనుష్‌ను అభినందిస్తున్న ప్రధానోపాధ్యాయురాలు

ఆర్టీసీ కరీంనగర్ జోన్ ఈడీ సమీక్ష


అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న జోన్ ఈడీ పగిడిమర్రి సోలమన్

భగత్‌నగర్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ జోన్ పరిధిలోని రీజినల్ మేనేజర్లు, డిప్యూటీ రీజినల్ మేనేజర్లతో కరీంనగర్ జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పగిడిమర్రి సోలమన్ గురువారం సమీక్షా సమావేశం నిర్వహించారు. అన్ని రీజియన్ల పనితీరు, ఆర్థిక పరిస్థితి, ప్రమాదాల నివారణ చర్యలు, రానున్న మేడారం జాతరకు సన్నద్ధతను సమీక్షించి తగు సూచనలు చేశారు. కార్యక్రమంలో రీజినల్ మేనేజర్లు బి రాజు, డి విజయభాను, టి జ్యోత్స్న, ఎ సరిరాం, ఎస్ భవాని ప్రసాద్, డిప్యూటి రీజినల్ మేనేజర్లు ఎస్ భూపతిరెడ్డి, ఎస్ మధుసూదన్, కె భానుకిరణ్, మహేష్, వి మల్లయ్య, ఎస్ రామయ్య, డి శ్రీహర్ష, డిప్యూటి చీఫ్ అకౌంట్స్ ఆఫీసర్ స్వప్నకుమారి, ఎస్ ప్రణీత్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కార్యదర్శి కె యుగంధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నరసింహుడి సన్నిధిలో మంత్రి లక్ష్మణ్‌కుమార్ పూజలు



పూజలు చేస్తున్న మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

ధర్మపురి, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి క్షేత్రంలోని లక్ష్మీనరసింహస్వామి దేవాలయాన్ని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, వికలాంగుల సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ గురువారం ఉదయం సందర్శించారు. ఆలయం పక్షాన వేదపండితులు, అర్చకులు మంత్రికి పూర్ణకుంభ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మొదట ఆయన ధ్వజ స్తంభం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారిని దర్శనం చేసుకుని, మొక్కులు చెల్లించుకున్నారు. అంతకు ముందు మంత్రి యమధర్మ రాజు ఆలయం వద్ద గండ దీపంలో నూనె పోశారు. మంత్రి లక్ష్మణ్‌కుమార్‌ను ఆలయం పక్షాన ముఖ్య అర్చకులు నంబి శ్రీనివాసాచారి ఘనంగా ఆశీర్వదించారు.

ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ జక్కు రవీందర్, ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్ మంత్రి లక్ష్మణ్‌కుమార్‌ను శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఆయన వెంట ఆలయ సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్, సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్, కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షుడు వేముల రాజేష్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు చీపిరిశెట్టి రాజేష్, చిలుముల లక్ష్మణ్, జిల్లా కాంగ్రెస్ ఎస్సీ సెల్ ఉపాధ్యక్షులు చిలుముల లక్ష్మణ్, సీపతి సత్యనారాయణ, అర్చకులు తదితరులు పాల్గొన్నారు.

1 నుంచి డీఎడ్ పరీక్షలు

కరీంనగర్ టౌన్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): డీఎడ్ మొదటి సంవత్సరం పరీక్షలు డిసెంబర్ 1 నుండి 6వ తేదీ వరకు ఉదయం 9 నుంచి 12 గంటల వరకు జరుగుతాయని జిల్లా విద్యాశాఖ అధికారి ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల (ఓల్డ్ హైస్కూల్), ప్రభుత్వ ఉన్నత పాఠశాల బాలికలు (ఉర్దూ) ముకరంపుర లో పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు.

దక్షిణాదికి విద్యుత్ అందిస్తున్న రామగుండం ఎన్టీపీసీ..!

- నేడు వ్యవస్థాపక దినోత్సవం
- సీఎస్ఆర్ నిధులతో సామాజిక కార్యక్రమాలు



ప్రాజెక్టుకు శంకుస్థాపన చేసిన అప్పటి ప్రధాని మొరార్జీదేశాయ్(ఫైల్)

జ్యోతినగర్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): దక్షిణాది విద్యుత్ అవసరాలను తీర్చంలో రామగుండం ఎన్టీపీసీ కీలక పాత్ర పోషిస్తున్నది. యేటా ఉత్పత్తి లక్ష్యాలను అధిగమిస్తూ విస్తరణ దిశగా అడుగులు వేస్తున్నది. 1978 నవంబరు 14 అప్పటి ప్రధాని మొరార్జీ దేశాయ్ చేతుల మీదుగా పునాది రాయి పడింది. నిర్ణీత గడువు కన్నా ముందే ఉత్పత్తిని ప్రారంభించాయి. ఈ ప్రాజెక్టులో పూర్తిస్థాయి విద్యుత్ ఉత్పత్తి చేసేందుకు రోజుకు 42 వేల మెట్రిక్ టన్నుల బొగ్గు అవసరం ఉంటుంది. 2100 మెగావాట్ల సామర్థ్యం ఉన్న స్టేజ్ 1, స్టేజ్ 2 యూనిట్లలో విద్యుత్ ఉత్పత్తికి సింగరేణి నుంచి రోజుకు 32వేల మెట్రిక్ టన్నులు, ఒడిశాలోని మహానది కోల్‌ఫీల్డ్స్ నుంచి 8వేల మెట్రిక్ టన్నుల బొగ్గు ఒప్పందం ఉంది. ప్రాజెక్టు అవసరమైన 6.5 టీఎంసీల నీరు ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి ఎన్టీపీసీ బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌లో నిల్వ ఉంచుతారు.

ప్రాజెక్టుకు అవార్డులు.. రివార్డులు..

రామగుండం ఎన్టీపీసీకి 47 సంవత్సరాలలో అనేక జాతీయ, అంతర్జాతీయ అవార్డులు లభించాయి. 2025 ఎనర్జీ ఎక్స్‌లెన్స్ అవార్డు లభించింది. రాజ్ భాష హిందీ అమలులో ప్రాజెక్టుకు కేంద్రం నుంచి జాతీయస్థాయి పురస్కారం లభించింది. టిఎస్‌టిపిపికి నేషనల్ సేఫ్టీ 2025 అవార్డు లభించింది.

ఏ రాష్ట్రానికి ఎంత విద్యుత్...

- తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌కు 754 మెగావాట్లు(29శాతం)
- తమిళనాడుకు 572 మెగావాట్లు(22శాతం)
- కర్నాటకకు 416 మెగావాట్లు(16శాతం)
- కేరళకు 312 మెగావాట్లు(12శాతం)
- గోవాకు 130 మెగావాట్లు(5శాతం)
- పాండిచ్చేరికి 52 మెగావాట్లు(2శాతం)
- ఎవరికీ కేటాయించనిది(అన్ అలాటెడ్) 364మెగావాట్ల(14శాతం)

సామాజిక బాధ్యత..

విద్యుత్ ఉత్పత్తితోపాటు ప్రాజెక్టు ప్రభావిత గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తున్నది. సీఎస్ఆర్ నిధులు వివిధ కార్యక్రమాలకు ఖర్చు చేస్తోంది. ప్రభుత్వ పాఠశాలల్లో మరుగుదొడ్లు, గ్రామాలలో వసతుల కల్పన, విద్య, ఆరోగ్యం, స్వయం ఉపాధి కోసం సంస్థ చేయూతనిస్తోంది. విద్యార్థులకు పుస్తకాల పంపిణీ, ఉపకార వేతనాల కార్యక్రమాలను చేపట్టింది.

పర్యావరణ పరిరక్షణకు కృషి

ఎన్టీపీసీ పరిసర ప్రాంతంలో సుమారు 14 లక్షల చెట్లను సంస్థ సంరక్షిస్తున్నది. ప్రాజెక్టు నుంచి వెలువడే బూడిద సమస్యను నివారించడానికి ఎన్టీపీసీ వినూత్న పథకాలను అమలు చేస్తోంది. పర్యావరణ పరిరక్షణ విషయంలో ప్రాజెక్టుకు ఐఎస్‌వో-14001 గుర్తింపు లభించింది.

టిఎస్‌టిపిపి స్టేజ్ 2 నిర్మాణానికి రెడీ..

రామగుండం ఎన్టీపీసీ ఆవరణలో 4000 మెగావాట్ల మరో ప్రాజెక్టును నిర్మిస్తోంది. మొదటి దశలో 800 మెగావాట్ల రెండు యూనిట్లు పూర్తయ్యాయి. మరో 2400 మెగావాట్ల నిర్మాణం జరగనుంది.

సమష్టి కృషితో ప్రగతి పథంలో

- ఈడీ చందన్ కుమార్ సామంత

ఉద్యోగులు, అధికారులు, కాంట్రాక్టు కార్మికుల సమష్టి కృషి ఫలితంగా రామగుండం ప్రాజెక్టు ప్రగతిపథంలో నడుస్తోంది. రక్షణతో కూడిన నాణ్యమైన విద్యుత్ ఉత్పత్తికి అధిక ప్రాధాన్య తనిస్తాం. ఉత్పత్తి, రక్షణ, పర్యావరణ పరిరక్షణ, సీఎస్ఆర్, ఉద్యోగుల సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నాం. ఎన్టీపీసీ రేజింగ్ డే సందర్భంగా సిబ్బందికి, ఈ ప్రాంత ప్రజలకు శుభాకాంక్షలు.

యూనిట్లలో ఉత్పత్తి ప్రారంభ వివరాలు

స్టేజ్-1
200 మెగావాట్ల 1వ యూనిట్ 1983 అక్టోబర్ 26
200 మెగావాట్ల 2వ యూనిట్ 1984 మే
200 మెగావాట్ల 3వ యూనిట్ 1984 డిసెంబర్

స్టేజ్-2
500 మెగావాట్ల 4వ యూనిట్ 1988 జనవరి
500 మెగావాట్ల 5వ యూనిట్ 1989 మార్చి
500 మెగావాట్ల 6వ యూనిట్ 1989 అక్టోబర్

స్టేజ్-3
500 మెగావాట్ల 7వ యూనిట్ 2004 సెప్టెంబర్

శ్రీరాంసాగర్‌కు 9,454 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

జగిత్యాల, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి గురువారం వరద నీరు స్థిరంగా వచ్చి చేరుతోంది. ఎగువ ప్రాంతం నుంచి 9,454 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. ప్రాజెక్టు నీటి నిల్వ 80.5 సామర్థ్యానికి ప్రస్తుతం 80.501 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

ఇసుక డంప్ సీజ్



అధికారులు సీజ్ చేసిన ఇసుక డంపు

సుల్తానాబాద్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నారాయణపూర్‌లో ఇసుక అక్రమ డంప్‌ను జిల్లా అధికారులు పట్టుకున్నారు. ఇక్కడి నుంచి కొన్ని నెలలుగా హైదరాబాద్, కరీంనగర్ ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారని అధికారులు తెలిపారు. జిల్లా మైనింగ్ ఏడీ శ్రీనివాస్ వివరాల మేరకు మండలంలోని నారాయణపూర్‌లో ఒక పాతరైస్ మిల్లు వద్ద ఇసుకను అక్రమంగా డంపు చేస్తున్నారని, మండలంలోని మానేరు పరివాహక ప్రాంత గ్రామాల నుంచి ట్రాక్టర్ల ద్వారా ఇసుకను తీసుకు వచ్చి ఇక్కడ నిల్వ చేస్తున్నారని వివరించారు. తమకు అందిన సమాచారం మేరకు గురువారం తెల్లవారుజామున నిఘా పెట్టి పట్టుకున్నామన్నారు. నారాయణపూర్ రైస్ మిల్‌లో ఇసుక కుప్పలుగా పోసి రాత్రి వేళల్లో కరీంనగర్, హైదరాబాద్‌కు తరలిస్తున్నట్టు తెలిపారు. తెల్లవారుజామున రెండు లారీలు, ఒక జీపును సీజ్ చేసి ఆర్డీవో ఆఫీసుకు తరలించినట్లు ఆయన తెలిపారు. అధికారుల ఆకస్మిక దాడిలో కొన్ని వాహనాలను తప్పించినట్లు తెలిసింది.

కొండగట్టులో ఆర్జితసేవల ధరల పెంపునకు బ్రేక్

- హర్షం వ్యక్తం చేస్తున్న భక్తులు
- ధరలు పెంచొద్దని కమిషనర్ దృష్టికి తీసుకెళ్లిన కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్

మల్యాల, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): కొండగట్టు ఆంజనేయస్వామి సన్నిధిలో ఈ నెల 15నుంచి ఆర్జిత సేవల టికెట్ల రెట్లను రెట్టింపు చేస్తూ మరిన్ని కొత్తగా అర్జితసేవలను ప్రారంభించనున్నట్లు ఇటీవల దేవస్థానం అధికారులు ప్రకటించగా వాటి అమలును వాయిదా వేస్తున్నట్లు ఈవో శ్రీకాంత్‌రావు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పూజ టికెట్ల పెంపు భక్తులకు భారం కానుందని భక్తులు, హిందూ సంస్థలు, రాజకీయ పార్టీల నుంచి వ్యతిరేకత వచ్చింది. కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్ దేవాదాయ శాఖ కమిషనర్, దేవస్థానం ఈవోతో గురువారం ఫోన్‌లో మాట్లాడి ఆగ్రహం వ్యక్తం చేసిన నేపథ్యంలో టికెట్ల పెంపు అమలు వాయిదా వేసినట్లు తెలుస్తోంది. భక్తులకు కనీస వసతులు కల్పించక అనేక ఇబ్బందుల పడుతుంటే రాబడే ధ్యేయంగా టికెట్ల పెంపు చేపట్టడంపై విమర్శలు వెల్లువెత్తడంతో దేవస్థానం అధికారులు పెంపు యోచనకు తాత్కాలికంగా బ్రేక్ వేశారు. నూతనంగా సుప్రభాతసేవ, వడమాల భోగము, మన్యసూక్త హోమం, శనిగ్రహ పీడ నివారణ ప్రవేశపెట్టారు. గతంలో నుంచి కొనసాగుతున్న అభిషేక పూజ, చందనం పూజ, గండదీపం, శాశ్వత అభిషేకం, 11 రోజుల హారతి అర్జిత సేవల ధరలను భారీగా పెంచారు. వీటి అమలును అధికారులు వాయిదా వేశారు. కొండగట్టుకు వచ్చేది అత్యధికంగా సామన్య భక్తులేనని అయితే ధరల పెంపు భక్తులకు భారం అవుతుందని అన్నివర్గాల నుంచి నిరసనలు రావడం, ఇటీవల బీజేపీ, వీహెచ్‌పీ నాయకులు దేవస్థానం అధికారులకు ధరలు పెంచొద్దని వినతిపత్రం అందించారు. ఈనెల 15 నుంచి ప్రారంభించే నూతన పూజలలోని సుప్రబాత సేవను మంగళవారం దేవస్థానం అధికారులు ప్రారంభించి సాధ్యాసాధ్యాలను పరిశీలించారు. అయితే నూతన అర్జిత సేవలు, టికెట్ల పెంపు వాయిదా వేస్తున్నటుట్లు గురువారం అధికారులు ప్రకటించడం గమనార్హం. ఎట్టకేలకు టికెట్ల ధరల పెంపు వాయిదా పడడంతో భక్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై ఈవో శ్రీకాంత్‌రావును సంప్రదించగా భక్తుల నుంచి అభ్యంతరాలు, పార్టీల నుంచి వినతులు రావడంతో ఎండోమెంట్ కమిషనర్ దృష్టికి తీసుకెళతానని వారికి హామీ ఇచ్చిన మేరకు కమిషనర్‌కు నివేదించినట్లు పేర్కొన్నారు. తదుపరి చర్యలు మళ్లీ ప్రకటిస్తామని పేర్కొన్నారు.



శ్రీ ఆంజనేయ స్వామి దేవస్థానము కొండగట్టు

గ్రా॥ ముత్యంపేట, మం॥ మల్యాల, జిల్లా॥ జగిత్యాల

క్ర.సం	ఆర్జిత సేవా వివరములు	రుసుము
1.	సుప్రభాత సేవ	1000-00
2.	చందనం(సింధూరం) పూజలో	1500-00
3.	మన్యుసూక్త హోమం	2000-00
4.	వడమాల భోగము	1116-00
5.	శనిగ్రహ పీడ నివారణ పూజ	1000-00
6.	అంతరాలయ దర్శనం	800-00

ఆలయంలో ఏర్పాటు చేసిన ధరల సూచిక

భక్తుల సౌకర్యాలపై దృష్టి సారించాలి

- కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్

కరీంనగర్, నవంబరు 13(ఆంధ్రజ్యోతి, ప్రతినిధి)/మల్యాల: కొండగట్టులో పెంచిన అర్జిత సేవా టిక్కెట్ల రేట్లను తగ్గించి, భక్తుల సౌకర్యాలపై దృష్టి సారించాలని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ అన్నారు. గురువారం కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ దేవాదాయ శాఖ అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. కొండగట్టులో భక్తులకు ఆర్జిత సేవా టికెట్లు పెంపుపై మల్యాల బీజేపీ మండల అధ్యక్షుడు గాజుల మల్లేశం కేంద్ర మంత్రి హోంశాఖ సహాయ మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆలయ అధికారులపై మంత్రి అసహనం వ్యక్తం చేశారు. కొండగట్టు ఆలయంలో కనీస సౌకర్యాలు లేక భక్తులు ఇబ్బందులు పడుతున్నారని, సౌకర్యాల మీద దృష్టి సారించాల్సిన అధికారులు ఆర్జిత సేవా టికెట్ల ధరలు పెంచడ మేమిటని ప్రశ్నించారు. తక్షణమే పెంచిన ఆర్జిత సేవా టికెట్ల రేట్లను తగ్గించాలని, కొండగట్టులో కనీస సౌకర్యాల కల్పనపై దృష్టి సారించి భక్తుల ఇబ్బందులు తొలగించాలన్నారు.

శాతవాహనలో యాంటీ ర్యాగింగ్‌పై సదస్సు



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న సీఐ కోటేశ్వర్, పక్కన ఎస్‌యూ రిజిస్ట్రార్ ఆచార్య రవికుమార్ జాస్తి, ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సుజాత

గణేశ్‌నగర్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): యాంటీ ర్యాగింగ్, మహిళా భద్రత, మాదక ద్రవ్యాల నియంత్రణపై శాతవాహన విశ్వవిద్యాలయం ఆర్ట్స్ కళాశాల సెమినార్ హాల్‌లో గురువారం కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య సుజాత అధ్యక్షతన అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన రిజిస్ట్రార్ ఆచార్య రవికుమార్ జాస్తి మాట్లాడుతూ ర్యాగింగ్ చేసినట్టు తెలిస్తే కళాశాల నుంచి డిస్మిస్ చేయడమే కాకుండా పోలీస్ కేసు నమోదవుతుందన్నారు.

కొత్తపల్లి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కోటేశ్వర్ మాట్లాడుతూ మాదకద్రవ్యాలు కలిగి ఉండడం, సేవించడం చట్టరీత్యా నేర మని అలాంటి విద్యార్థులు శిక్షార్హులు అవుతారని అన్నారు. షీ టీమ్స్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ శ్రీలత మాట్లాడుతూ విద్యార్థులు ర్యాగింగ్ పేరుతో ఎవరినీ వేధించవద్దన్నారు. కేసు నమోదైతే జీవితంలో వారికి ఎలాంటి ప్రభుత్వ ఉద్యోగం రాదని అన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య సుజాత మాట్లాడుతూ విద్యార్థులు అనవసర విషయాలతో జీవితాలను నాశనం చేసుకోవద్దని సూచించారు. కార్యక్రమంలో కామర్స్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ హరికాంత్, సైన్స్ కళాశాల ప్రిన్సిపల్ రమాకాంత్, చీఫ్ వార్డెన్ డాక్టర్ నజీముద్దీన్ మున్వర్, హాస్టల్ వార్డెన్స్ డాక్టర్ కృష్ణకుమార్, సావిత్రి, కేర్ టేకర్ సంధ్య, రమేష్ కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వైభవంగా గోదావరి హారతి



గోదావరి మాతకు హారతి ఇస్తున్న అర్చకులు, భక్తులు

ధర్మపురి, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం పురస్కరించుకుని ధర్మపురి వద్ద గోదావరి హారతి 23వ రోజు గురువారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రమేష్‌శర్మ భక్తులను ఉద్దేశించి ధార్మిక ప్రసంగం చేశారు. కార్తీక మాసం ఆరంభం నుంచి జరుగుతునన కార్యక్రమంలో భాగంగా ఆలయ వేదపండితులు, అర్చకులు, సిబ్బంది, భక్తులు, మహిళలు మంగళ వాయిద్యాలు వెంటరాగా గోదావరి నది వరకు శోభాయాత్ర నిర్వహించారు. అనంతరం ఆలయ వేదపండితుల మంత్రోచ్ఛరణల మధ్య అర్చకులు విశేష పూజలు నిర్వహించారు. రాత్రి వరకు నదీ మాతకు హారతి ఇచ్చి కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ జక్కు రవీందర్, ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్, అర్చకలు, వేదపండితులు, శారదా మహిళా మండలి, వాసవి మహిళా మండలి సభ్యులు, కరీంనగర్ తిరుమల సేవా గ్రూపు సభ్యులు, పెద్దపల్లి శ్రీ వల్లి సేవా గ్రూపు సభ్యులు, స్థానిక మహిళలు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

18న ఉమిద్ పోర్టల్ వక్ఫ్‌పై అవగాహన సదస్సు




సమావేశంలో మాట్లాడుతున్న సమద్‌నవాబ్

కరీంనగర్ అర్బన్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఉమిద్ పోర్టల్ వక్ఫ్‌పై ఉమ్మడి జిల్లా అవగాహన సదస్సును ఈ నెల 18న నిర్వహిస్తున్నామని, సదస్సుకు రాష్ట్ర వక్ఫ్ బోర్డు చైర్మన్ అజ్మతుల్లా హుస్సేన్ ముఖ్య అతిథిగా పాల్గొంటారని జిల్లా వక్ఫ్ బోర్డు ప్రొటెక్షన్ డెవెలప్‌మెంట్ కమిటీ చైర్మన్ సమద్‌నవాబ్ తెలిపారు. ఈ మేరకు గురువారం ఓ హోటల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మా ట్లాడారు. నెల 18న నగరంలోని కరీంనగర్ ఫంక్షన్ హాల్‌లో ఉమిద్ పోర్టల్ వక్ఫ్‌కు సంబంధించిన మూడు అంశాల మీద చర్చ నిర్వహించ నున్నట్లు తెలిపారు. ఈ సదస్సుకు ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని ఈద్గా, దర్గా, ఖబ్రస్తాన్, మసీద్ , మదర్సా కమిటీ అధ్యక్షులు, సభ్యులు, జిల్లా కాంగ్రెస్ మైనారిటీ నాయకులు, మైనారిటీ ప్రజలు, కాంగ్రెస్ పార్టీ శ్రేణులు హాజరుకావాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో జిల్లా కాంగ్రెస్ మైనారిటీ సెల్ అధ్యక్షుడు ఎండీ తాజుద్దీన్, జిల్లా కాంగ్రెస్ నాయకులు ఎండీ లయాక్, అబ్దుల్ రెహమాన్, ఎండీ చాంద్, ఇర్ఫాన్, మొహమ్మద్ ఖలీముద్దీన్, మహమ్మద్ ఆమేర్, మన్సూర్, తవక్కలి తదితరులు పాల్గొన్నారు.

తీయని బాధ

నేడు ప్రపంచ మధుమేహ దినోత్సవం

సుభాష్‌నగర్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): చక్కెర.. ప్రతి మనిషి జీవితంలో కీలకపాత్ర వహిస్తుంది.. ఏదైనా శుభవార్త విన్నప్పుడు నోటిని తీపి చేసుకో అనడం పరిపాటి. ప్రస్తుతం ఆ నానుడి మారుతోంది.. ప్రతి ఒక్కరూ చక్కెరకు సాధ్యమైనంత దూరంగా ఉండండి అంటున్నారు. ఇందుకు కారణం మధుమేహం.. మన దేశంలో దాదాపు 12 కోట్లమంది డయాబెటిస్‌తో బాధపడుతున్నారు. 14 కోట్లకు పైగా ప్రీడయాబెటిస్ (భవిష్యత్‌లో డయాబెటీస్ వచ్చేవారు) స్థితిలో ఉన్నారు. ఇన్సులిన్‌ను కనుగొన్న ఫ్రెడరిక్ బ్యాంటింగ్ జయంతి నవంబరు 14. ప్రపంచ వ్యాప్తంగా అతివేగంగా పెరుగుతున్న మధుమేహవ్యాధిని దృష్టిలో ఉంచుకొని ఐడీఎఫ్, (డబ్ల్యుహెచ్‌వో) ప్రపంచ ఆరోగ్య సంస్థలు సంయుక్తంగా ప్రజల్లో అవగాహన పెంపొందించడానికి ప్రతి సంవత్సరం నవంబరు 14ను ప్రపంచ మధుమేహ దినంగా 1991 నుంచి నిర్వహిస్తున్నారు. ఈ సంవత్సర నినాదం 'మధుమేహ వ్యాధి రోగుల శ్రేయస్సు'.



మధుమేహం అంటే ఏమిటి?

ఇన్సులిన్ శరీరంలో సరిగా తయారు కాకపోవడం వల్ల, ఇన్సులిన్ సరిగా ఉపయోగపడక పోవడంవల్ల రక్తంలో షుగర్ లెవల్ అతిగా పెరిగిపోతుంది. ఇది హానికరం. ఇది దీర్ఘకాలిక వ్యాధి. ఒక్కసారి వచ్చిందంటే జీవితాంతం ఉంటుంది. కాబట్టి ఈ జబ్బుకు వైద్యం చేసే సమయంలో రోగితో పాటు అతని కుటుంబ సభ్యులు కూడా బాధ్యత భాగం తీసుకోవాలి. జబ్బు లక్షణాలు, దాని ప్రభావాల గురించి అవగాహన పెంచుకొని షుగర్ లెవల్స్‌ను అదుపులో పెట్టుకోవాలి. సరైన వ్యాయామం చేస్తే, ఆహార నియమాలు, డాక్టర్ ఇచ్చే సలహాలు పాటించాలి. మధుమేహ రోగులు అదుపులో ఉన్న చక్కెర శాతంతో సాధారణ జీవితం గడపవచ్చు. కనీసం రోజుకు ఏడు గంటలు నిద్రపోవాలి. ధూమపానానికి, మద్యపానానికి దూరంగా ఉండండి. కొలెస్ట్రాల్‌ను, శరీర బరువును అదుపులో ఉంచుకోవాలి.

ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లు

మధుమేహ రోగులు చిన్న మార్పులతో సాధారణ ఆహారం తీసుకోవచ్చు. చక్కెర, తీపివస్తువులు, వెన్న, నెయ్యి అతిగా నూనెలు వాడవద్దు. కూల్‌డ్రింక్స్‌కు దూరంగా ఉండాలి. తెల్లని బియ్యం, తెల్లని బ్రెడ్, మైదాపిండి వాడకం తగ్గించాలి. వాటి స్థానంలో దంపుడు బియ్యం, బ్రౌన్ బ్రెడ్, ఓట్స్ లాంటివి వాడటం మంచిది. తాజా కూరగాయల్ని, పండ్లను ఎక్కువగా తీసుకోవాలి.

వైద్యుల సలహాలు పాటించాలి..


- డాక్టర్ రఘురామన్, సీనియర్ ఫిజీషియన్



డయాబెటిక్ వచ్చినవారు సకాలంలో డాక్టర్‌ను సంప్రదించాలి. డాక్టర్ సూచించిన విధంగా మందులు వాడుతూ సలహాలు సూచనలు పాటించాలి. ఆహార నియమాలను పాటించాలి. డయాబెటిస్ ఉందని భయపడాల్సిన అవసరం లేదు. ప్రస్తుతం మంచి మందులు అందుబాటులో ఉన్నాయి. మూడు నెలలకు ఒకసారి రక్త పరీక్షలు మెరుగ్గా చేసుకొవాలి. సంవత్సరానికి ఒకసారి కంటి పరీక్ష, ఈసీజీ, కిడ్నీ పరీక్షలు చేసుకోవాలి. డయాబెటిస్ రాకుండా ఉండాలంటే తగినంత శారీరక శ్రమ చేస్తూ సమతుల్య ఆహారం తీసుకోవాలి. రోజు కనీసం 30 నిమిషాలు వ్యాయామం చేయాలి. ఒత్తిడిని తగ్గించుకోవాలి. పౌష్టికాహారం లోపంతో టైప్-5 డయాబెటీస్‌ను గుర్తించారు. ఈ విషయాన్ని ఇటీవల కేరళలో నిర్వహించిన అఖిల భారత మధుమేహ వైద్యుల సదస్సులో నిపుణులు వెల్లంచారు. సాధారణంగా వివిధ కారణాల వల్ల ప్రాంక్రియాస్ చెడిపోతే షుగర్ వ్యాధి వస్తుంది. కాని టైప్-5 పౌష్టికాహార లోపం వల్ల వస్తుందని గుర్తించారు. వీరు చూడడానికి సాధారణంగానే కనిపిస్తారు.

ప్రమాదకరంగా వరదకాలువ వంతెనలు

- కూలిన రక్షణ గోడలు



ముత్యంపేట శివారులో వాహనాలు ఢీకొనడంతో కూలిన రక్షణగోడ

మల్యాల, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): వరదకాలువ వంతెనల వద్ద నిర్మించిన రక్షణగోడలు కూలి ప్రమాదకరంగా మారాయి. మల్యాల మండలంలోని రాంపూర్, గొల్లపల్లె, రామన్నపేట, నూకపల్లి, ముత్యంపేట, సర్వాపూర్ గ్రామాల పరిధిలో గల వరదకాలువపై రహదారిపై వంతెనలు నిర్మించగా వాటి రక్షణగోడలు చాలా చోట్ల వాహనాలు ఢీకొని ధ్వంసం అయ్యాయి. టిప్పర్లు, ఇతరవాహనాలు ఢీకొనడంతో దెబ్బతింటున్నాయి. నెలల తరబడి వాటికి మరమ్మతులు చేపట్టకపోవడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. అధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ చర్యలు తీసుకోవడం లేదని ప్రజలు పేర్కొంటున్నారు.



వాహనం ఢీకొని ధ్వంసం అయిన రక్షణ గోడ

పశువైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

పెగడపల్లి, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : పశు సంపద కలిగిన ప్రతి ఒక్కరు పశువైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి బి.ప్రకాశ్ పేర్కొన్నారు. పెగడపల్లి మండలంలోని మ్యాకవెంకయ్యపల్లిలో గురువారం పశువులకు గాలికుంటు టీకాల శిబిరాన్ని నిర్వహించగా జిల్లా పశువైద్యశాఖ అధికారి బి.ప్రకాశ్ ఆకస్మికంగా సందర్శించి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎన్ని పశువులు ఉండగా ఎన్నింటికి టీకాలు వేశారు రికార్డులు పరిశీలించి వందశాతం టీకాలు వేయాలన్నారు. గాలికుంటు వ్యాధి అనేది ప్రాణాంతకమైందని, సూక్ష్మాతి సూక్ష జీవుల వలన పశువులకు గాలికుంటు వ్యాదులు ప్రబలి అధిక జ్వరం నోటిలో పొక్కులు , సొంగ కారడం లాంటి లక్షణాలు కనబడితే వెంటనే పశువైద్యులను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో మండల పశువైద్యాధికారి డాక్టర్ హేమలత, సిబ్బంది మతిన్, వినీత్, జానీపాష, శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

కంటి వైద్య శిబిరం

కథలాపూర్, నవంబరు13 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని బొమ్మెనలో గురువారం లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహిచిన ఉచిత కంటి వైద్య శిబిరంకు స్పందన కనిపించింది. రేకుర్తి కంటి వైద్యశాలకు చెందిన వైద్యులు 80 మంది రోగులను పరీక్షించారు. ఇందులో 35 మందికి కంటి శుక్లాల ఆపరేషన్లు అవసరమని గుర్తించి బస్సులో రేకురికి పంపించారు. ఈ కార్యక్రమంలో రీజియన్ చైర్మన్ గుంటుక సురేశ్‌బాబు, మండల అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్‌రెడ్డి ఉన్నారు.

మాజీ మంత్రిని కలిసిన సినీ దర్శకుడు

జగిత్యాల, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని ఇందిరా భవన్ కాంగ్రెస్ కార్యాలయంలో మాజీ మంత్రి తాటిపర్తి జీవన్‌రెడ్డిని గురువారం ప్రముఖ సినీ దర్శకుడు రాజ్ నరేంద్ర మర్యాదపూర్వకంగా కలిశారు. పర్యావరణ పరిరక్షణపై అవగాహణ కల్పిస్తూ ఇటీవల సినిమా రూపొందించడాన్ని అభినందిస్తూ దర్శకుడు రాజ్ నరేంద్రను మాజీ మంత్రి జీవన్ రెడ్డి శాలువతో సత్కరించారు. కార్యక్రమంలో టీపీసీసీ సెక్రెటరీ బండ శంకర్ పాల్గొన్నారు.

టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలి

జగిత్యాలరూరల్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): 2009 కంటే ముందు నియాయమకమైన ఉపాధ్యాయులకు టెట్ పరీక్ష నుండి మినహాయింపు ఇవ్వాలని తెలంగాణ రాష్ట్ర ఐక్యోపాధ్యాయ ఫెడరేషన్ అధ్యక్షుడు తిరుకోవెల శ్యాం సుందర్ అన్నారు. జగిత్యాల మండలం లోని ప్రభుత్వ పాఠశాలల్లో గురువారం సంఘ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహిం చారు. ఈకార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి అంబటి భూహేశ్వర్, కోశాధికారి శ్రీనివాస్, మండల అధ్యక్షులు తిరునగరి ప్రభాకర్ పాల్గొన్నారు.

ఎస్జీఎఫ్ పోటీల్లో ప్రతిభ

మెట్‌పల్లి టౌన్, నవంబరు13 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ జోనల్ స్థాయి ఎస్జీఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో పట్టణంలోని విజడం గ్రామర్ హైస్కూల్ 10వ తరగతి విద్యార్థి మనితేజ, 8వ తరగతి విద్యార్థి విహారిణి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ మేరకు గురువారం వారిని ఆ పాఠశాల కరస్పాండెంట్ ఎన్నమనేని రామారావు వారిని అభినందించారు.

నత్తనడకన ధాన్యం కొనుగోళ్లు

-కొనుగోలు కేంద్రాల్లో పేరుకుపోతున్న ధాన్యం -కేంద్రాల్లో రోజుల తరబడి రైతుల పడిగాపులు -పట్టించుకోని అధికారులు

గొల్లపల్లి, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : గొల్లపల్లి మండలంలో ధాన్యం కొనుగోళ్లు నత్తనడకన సాగుతున్నాయి. మండలం లోని కేంద్రాల్లో, ఆరు బయట, రోడ్ల వెంట విక్రయానికి పోసిన వరి ధాన్యం రాశులు ఎక్కడి ధాన్యం అక్కడే కుప్పలు తెప్పలుగా పేరుకు పోయాయి. రైతులు కేంద్రాల్లో రోజుల తరబడి పడిగాపులు పడాల్సిన దుస్థితి నెలకొంది. ఇంత జరుగుతున్నా సంబంధిత ఉన్నతాధికారులు పట్టించు కోవడం లేదని రైతులు ఆరోపిస్తున్నారు. పదిహేను రోజులుగా గొల్లపల్లి మండలం లోని వివిధ గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను అధికారులు ఏర్పాటు చేశారు. కానీ ఇప్పటివరకు పలు గ్రామాల్లో వరి ధాన్యం కొనుగోళ్ల ప్రారంభానికే నోచుకోని పరిస్థితి నెలకొంది. కేంద్రాలకు మిల్లులను సైతం పూర్తి స్థాయిలో మిల్లును కేటాయించలేదనే విమర్శలు ఉన్నాయి. అధికారుల నిరక్ష్యం రైతులకు శాపంగా మారింది.



వ్యవసాయ మార్కెట్ యార్డులో వడ్లను నేర్పుతున్న రైతు

●ప్యాక్స్ ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాలు

గొల్లపల్లి సింగిల్‌విండో ఆధ్వర్యంలో మండలంలోని వివిధ గ్రామాల్లో మొత్తం 15 కేంద్రాలను ఏర్పాటు చేశారు. చెందోళి సింగిల్‌విండో ఆధ్వర్యంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను చెందోళి, ఆత్మకూర్, దమ్మన్న పేట, చిల్వాకోడూర్, గోవిందు పల్లె, లొత్తునూర్ తదితర ఆరు గ్రామాల్లో ప్రారంభించారు. మూడు గ్రామాల్లో మినహా ఇప్పటివరకు కొనుగోళ్ల ప్రారంభానికి నోచుకోవడం లేదు. దీంతో పాటు ఐకేపీ ఆధ్వర్యంలో వెన్గుమట్ల, బొంకూర్, శంకర్రావుపేట, వెంగళాపూర్ తదితర నాలుగు గ్రామాల్లో వరి ధాన్యం కొనుగోళ్లను ప్రారంభించగా నామమాత్రంగా కొనుగోళ్లు కొనసాగుతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తేమ శాతం అధికంగా ఉంటోందని నిర్వాహకులు పేర్కొం టుండగా, పూర్తిగా ఎండి వరి ధాన్యం బరువును కోల్పోయే ప్రమాదం ఉందని రైతులు అంటున్నారు. పలు కేంద్రాల్లో రైతులకు కావాల్సిన మౌలిక వసతులను సైతం నిర్వాహకులు కల్పించడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. కేంద్రాల్లో టార్పాలిన్ల పంపిణీలో తీవ్ర జాప్యం నెలకొంటుందని రైతులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు కొనుగోళ్లను వేగవంతం చేసేలా చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

కొత్త మిషన్లు తెప్పించాం..

-వరలక్ష్మి, కార్యదర్శి, ఏఎంసీ, గొల్లపల్లి

వ్యవసాయ మార్కెట్‌లో ఉన్న మ్యాచర్ మిషన్లు కొంతమేర సరిగ్గా పని చేయడం లేదని రైతులు తెలపడంతో వెంటనే కొత్త మిషన్లు తెప్పించాం. ఎలక్ట్రానిక్ కాంటాల్లో తూకంలో తేడాలు వస్తున్నా యంటే వాటిని సరి చేయించాం. రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా ఎప్పటికప్పుడు చర్యలు చేపడుతున్నాం.

పాఠశాలల్లో ముందస్తు బాలల దినోత్సవం



జ్యోతి పాఠశాలలో నృత్యాలు చేస్తున్న విద్యార్థులు

జగిత్యాల అగ్రికల్చర్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని స్థానిక జ్యోతి హైస్కూల్ ఐఐటీ అకాడమీలో ముందస్తు బాలల దినోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని పాఠశాల డైరెక్టర్ బియాల హరిచరణ్‌రావు జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. 90స్ కిడ్స్ అనే ప్రత్యేక స్కిట్ ప్రేక్షకులను ఆకట్టుకుంది. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ హరిచరణ్‌రావు మాట్లాడుతూ బాలలే దేశ భవిష్యత్తుకు ప్రతీకలని, వారి కలలు ఈ దేశానికి దిశానిర్దేశం చేస్తాయన్నారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్‌లు హరిచరణ్‌రావు, శ్రీధర్‌రావు, మౌనికరావు, అజితరావు, ఉపాధ్యాయబృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

●పట్టణంలోని స్థానిక మానస స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్ పాఠశాలలో ముందస్తు బాలల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ రజితరావు మాట్లాడుతూ పిల్లల భవిష్యత్తు, సృజనాత్మకత, ఆత్మ విశ్వాసం పెంపొందుతుందన్నారు. కార్యక్ర మంలో పాఠశాల డైరెక్టర్‌లు శ్రీధర్‌రావు, హరిచరణ్‌రావు, మౌనికరావు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కుల పంపిణీ

మెట్‌పల్లి టౌన్, నవంబరు13 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గురువారం మెట్‌పల్లి మండలానికి సంబంధించిన పలువురు లబ్దిదారులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ అంధించారు. వీటి విలువ రూ.5.85 లక్షలు కాగా 27 మంది లబ్దిదారులకు అందజేశారు. ఇందులో మెట్‌పల్లి పట్టణానికి రూ.3.78 లక్షలు విలువల గల చెక్కులు 18 మందికి ఇవ్వగా మొత్తం రూ.9.63 లక్షలు కాగా మొత్తం లబ్దిదారులు 45 మందికి అందించినట్లు తెలిపారు. ఈ కార్యక్ర మంలో లబ్దిదారులతోపాటు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

ఇబ్రహీంపట్నం, నవంబరు13 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని రైతువేదికలో పలువురు లబ్దిదారులకు గురువారం కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ కళ్యాణ లక్ష్మీ, షాదీ ముబారక్ చెక్కులను ఆయన చేతుల మీదుగా అంద జేశారు. మొత్తం 34 మందికి రూ.34,03,944 విలువ గల చెక్కులను అందించారు. మండలానికి చెందిన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు రూ.2,78,000 విలువగల 11 మంది లబ్దిదారులకు అందించారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు, లబ్దిదారులు పాల్గొన్నారు.

●మండలంలోని బర్తీపూర్ గ్రామానికి చెందిన ఓరుగంటి చరణ్ తేజకు రూ.లక్ష విలువ గల ఎల్‌ఓసీని ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ అందించారు. కాగా ఆ చెక్కును బాధిత కుటుంబానికి అందించారు.

వయోజన విద్య అమలుపై శిక్షణ

రాయికల్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): రాయికల్ మండల సమాఖ్య కార్యాలయంలో గురువారం సెర్ప్-డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో గ్రామ సంఘ కార్యవర్గ సభ్యులు, వీవోఏలకు శిక్షణ కార్యక్రమం నిర్వహిం చారు. మండలంలోని మహిళా సంఘ సభ్యులలోని నిరక్షరాస్యులను అక్షరాస్యు లుగా తీర్చిదిద్దాలని, తద్వారా సంఘాల ఆర్థిక లావాదేవీలు స్వయంగా నిర్వహిం చేలా తయారు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో సుష్మా ఏపీఎంలు పోతు నరహరి, విమోచన, సీసీలు గంగారాం, సుజాత, లావణ్య, సీఆర్‌పీలు అనిత, కౌసర్ పాల్గొన్నారు.

స్వగ్రామం చేరిన మృతదేహం

మల్లాపూర్, నవంబరు13 (ఆంధ్రజ్యోతి): షార్జాలో గుండెపోటుతో మృతిచెందిన మండలంలోని వాల్గొండతండాకు చెందిన లకావత్ రమేష్ (42) మృతదేహం గురువారం స్వగ్రామం చేరుకుంది. రమేష్ జీవనోపాధి నిమిత్తం దుబాయ్ వెళ్లినాడు. గత ఏడాది క్రితం స్వ గ్రామానికి వచ్చి తన కూతురు పెండ్లి చేసి తిరిగి దుబాయ్ వెళ్లాడు. బుధవారం రమేష్ గుండెపోటుకు గురై మృతిచెందాడు. మృతుడు రమేష్‌కు భార్య పద్మ, కొడుకు హర్షిత్ కూతురు వసంతలు ఉన్నారు.

సీపీఐ శత జయంతి ఉత్సవాలు విజయవంతం చేయాలి

కోరుట్ల, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : సీపీఐ శత జయంతి వేడుకలను విజయవంతం చేయ్యాలని ఏఐటీయుసీ జిల్లా అధ్యక్షుడు సుతారి రాములు, సీపీఐ జిల్లా కార్యదర్శి చెన్న విశ్వనాథంలు కోరారు. గురువారం పట్టణంలోని సి.ప్రభాకర్ భవనంలో శత జయంతి ఉత్సవాలకు చెందిన కరపత్రంను స్థానిక నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్బంగా వారు మాట్లాడారు. 1925 సంవత్సరం డిసెంబరు 26వ తేదీన సిపిఐ పార్టి ఆవిర్భ వించిందని అన్నారు. కార్యక్రమంలో సిపిఐ నాయకులు మునుగంటి హన్మంత్, ఎండి ముక్రం, అక్రం పాషా, సమీర్, ఎర్రదండి భూమయ్య, ఎన్నం రాధ, కిరణ్, అతిక్, రాజం, తిప్పరి రమేష్, హలీ, వెలన్న మహేస్, గంగాధర్ పాల్గొన్నారు.

భూ వివాదం చుట్టూ రాజకీయం

(5వ పేజీ తరువాయి)

కారి శ్రీనివాస్‌తో పాటు సర్వే విభాగం అధికారులు, ఉద్యోగులు పలు విధాలుగా విచారణ, పరిశీలన చేస్తున్నారు. పెట్రోలు బంకుకు చెందిన స్థలం 20 గుంటలు ఉందా..హెచ్చుతగ్గులున్నాయా..స్థలం హద్దు లేమిటి అని తేల్చేందుకు కొలతలు నిర్వహించారు. అధికారులు విచారణ పూర్తి చేసి నివేదిక సమర్పించి, దాని ఆదారంగా తదుపరి చర్యలు చేపడితే గాని వివాదం సమసిపోయేలా కనిపించడం లేదు. స్థల వివాదం వ్యవహారం జిల్లా కేంద్రంలో హాట్ టాపిక్‌గా మారింది.

స్థల వివాదం నా దృష్టికి వచ్చింది

-అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, మంత్రి



జిల్లా కేంద్రంలో పెట్రోలు బంకు స్థల వివాదం నా దృష్టికి వచ్చింది. స్థల వివాదంపై అవసరమైన పత్రాలను పరిశీలిస్తాను. కలెక్టర్ సత్యప్రసాద్‌తో చర్చించి, డాక్యుమెంట్ వివరాలు పరిశీలించి స్పందిస్తాను. వివాదాస్పద స్థలంపై స్పందనను ప్రజలకు తెలపాల్సిన బాధ్యత నాపై ఉంది.

రైతులు దళారులను నమ్మి మోసపోవద్దు



కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

జగిత్యాల అగ్రికల్చర్, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని, ధాన్యం ఆరబెట్టిన తర్వాతనే అమ్ముకుంటే మద్దతు ధర దక్కుంతుందని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ అన్నారు. జగిత్యాల పట్టణంలోని స్థానిక 15వ వార్డు శంఖులపల్లెలో మెప్మా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన గురువారం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రైతులు నూతన సాంకేతికను ఉపయోగించుకొని, దేశంలో, రాష్ట్రంలో డిమాండ్ ఉన్న ఉత్పత్తులను పండించాలని, అప్పుడే అధిక లాభాలు వస్తాయన్నారు. లింగంపేట, గోవిందుపల్లెలో మెప్మా ఆధ్వర్యంలో వరిధాన్యం కొనుగోలు చేయాలని తన దృష్టికి వచ్చిందని, రైతుల అభ్యర్థన మేరకు కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు తనవంతు కృషిచేస్తానన్నారు. ఈ కొనుగోలు కేంద్రాల ద్వారా మెప్మాకు ఆదాయం రావడం అభినందనీయం అని, మహిళా సంఘాలు, స్టీల్ బ్యాంకు ఏర్పాటుతో శుభకార్యక్రమాలకు ఇవ్వడం వల్ల ఆదాయం పొందే అవకాశం ఉందన్నారు. ఆదాయ మార్గాలు సృష్టించుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. రాష్ట్రంలోనే అత్యధిక నిధులు జగిత్యాలకు మంజూరయ్యాయని, అభివృద్దికోసం అందరితో కలిసి పనిచేస్తానని, జగిత్యాల అభివృద్దే తన అంతిమ లక్ష్యం అన్నారు. మహిళా సంఘాల అభ్యున్నతికి సీఎం రేవంత్‌రెడ్డి కృషి చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ స్పందన, మాజీ వైస్ చైర్మెన్ గోలి శ్రీనివాస్, మెప్మా ఏవో శ్రీనివాస్, టీయంసీ రజిత, మాజీ కౌన్సిలర్ తోట మల్లిఖార్జున్ తో పాటు ఆయా వార్డుల మాజీ కౌన్సిలర్‌లు, నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలి

ప్రముఖ మొబైల్ విడిభాగాల తయారీ కంపెనీ ఫాక్స్ కాన్ లో బ్లూ ఓషన్ హ్యూమన్ రిసోర్స్ మేనేజ్‌మెంట్ కంపెనీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మెగాజాబ్ మేళాను(మహిళలకు) సద్వినియోగం చేసుకోవాలని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ అన్నారు.10వ తరగతి విద్యార్హతతో 18-35ఏళ్ల వయస్సు గల మహిళలు అర్హులన్నారు. హైదరాబాద్‌లో 18వేల నెలవారి వేతనంతో ఉద్యోగం కల్పించబడునని తెలిపారు. నిరుద్యోగ మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ నెల 14న శుక్రవారం స్థానిక పద్మనాయక కళ్యాణ మండపంలో ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు ఇంటర్వ్యూలు నిర్వహించబడునని తెలిపారు.

13 మంది బైండోవర్

మెట్‌పల్లి టౌన్, నవంబరు13 (ఆంధ్రజ్యోతి): తన ఇంటిపై పలువురు ట్రాక్టర్ యజమానులు, డ్రైవర్లు దాడికి యత్నించి నిరసనకు దిగారని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా ఈనెల 11న తహసీల్దార్ ముందు 13మందిని పోలీస్‌లు బైండోవర్ చేసినట్లు 23వ వార్డు మాజీ కౌన్సిలర్ ఒజ్జల బుచ్చిరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా గురువారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ గత నెల 11న తాను ఇంటిలో లేని సమయం చూసి పలువురు ట్రాక్టర్ యజమానులు, డ్రైవర్లు ఇంట్లోకి చొరబడి మహిళలపై దురుసుగా మాట్లాడుతూ రోడ్డుపై బైఠాయించి ఆందోళన చేశారని పేర్కోన్నారు. వారిపై పోలీసులకు ఫిర్యాదు చేయగా, విచారణలో ఉద్దేశపూర్వకంగానే తేలడంతో వారిని తహసీల్దార్ ముందు ఈనెల 11న పోలీస్‌లు బైండోవర్ చేసినట్లు ఆయన తెలిపారు.

విద్యార్థులకు దుస్తులు పంపిణీ

ధర్మపురి, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి మండలంలోని తీగలధర్మారం గ్రామంలో గల మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు రూ 13 వేలు విలువ గల 26 జతల ఏకరూప క్రీడా దుస్తులు పంపిణీ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. హైదరాబాద్ వాస్తవ్యులు జైశెట్టి రామకృష్ణ-రజిత దంపతుల ఆర్థిక సహకారంతో మండల విద్యాధికారి సీతాలక్ష్మి చేతుల మీదుగా విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల నోడల్ అధికారి శంకరయ్య, పాఠశాల హెచ్‌ఎం వెంకటరమణ, రాజేష్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు ప్రధానోపాధ్యాయుడు లేక ఇబ్బందులు

-కొరవడిన పర్యవేక్షణ

పెగడపల్లి, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : పెగడపల్లి మండలంలోని బతికెపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశా లకు ప్రధానోపాధ్యాయుడు లేకపోవ డంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. పాఠశాల ప్రధానో పాధ్యాయుడిగా పనిచేసిన అల్లాడి భారతి అక్టోబరు 31న పదవీ విరమణ పొందారు. మరొకరికి ప్రదానోపాధ్యాయులుగా బాధ్యతలు అప్పగించాల్సి ఉండగా ఆ పాఠశాలలో పనిచేస్తున్న మిగతా ఏడుగురు ఉపాధ్యాయులు హెచ్‌ఎం బాధ్యతలు తమకొద్దంటున్నారు. దీంతో ఆ పాఠశాలలో ఉపాధ్యాయుల వేతనాల బిల్లులు, సప్లిమెంటరీ బిల్లులు ట్రెజరీకి పంపించే పరిస్థితులు లేకపోవడంతో పాటు తరగతుల నిర్వహణను పట్టించుకునే వారు కరువయ్యారు. ఆ పాఠశాల కాంప్లెక్సు పరిధిలో గల 11 పాఠశాలల పర్యవేక్షణ సైతం కొరవడిందని, ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు పట్టించు కుని తమ పాఠశాలకు ప్రధానోపాధ్యాయున్ని నియమించాలని విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు కోరుతున్నారు.

అధికారుల దృష్టికి తీసుకెళ్లాం

సులోచనాదేవి, మండల విద్యాధికారి

బతికెపల్లి ఉన్నత పాఠశాలలో ఇన్‌చార్జి హెచ్.ఎం బాధ్యతలు స్వీకరించేందుకు ఆ పాఠశాలలో పని చేసే ఉపాధ్యాయులెవరూ ముందుకు రావడం లేదు. ఈ విషయమై జిల్లా ఉన్నతాధికారులకు విన్నవించాం. త్వరలోనే ఇన్‌చార్జి హెచ్‌ఎంను నియమిస్తాం.

రాష్ట్ర స్థాయి పోటీలకు విద్యార్థిని ఎంపిక

కోరుట్ల, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని మాస్ట్రో జూనియర్ కళాశాల ఇంటర్ విద్యాభ్యాసం చేస్తున్న బత్తిని రసజ్ఞ జిల్లా స్థాయి పోటీలలో రాణించి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయినట్లు కళాశాల కరస్పాండెంట్ ఆకుల రాజేష్ గురువారం తెలిపారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా కేంద్రంలో జరిగిని జిల్లా స్థాయి అండర్ - 17 హైజంప్ పోటీలలో ప్రదమ స్థానం సాదించి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయినట్లు రాజేష్ తెలిపారు.

ప్రైవేట్ పాఠశాల నిర్వాహకులపై దాడి దురదృష్టకరం

కోరుట్ల, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): ప్రైవేట్ పాఠశాల నిర్వాహకులపై విద్యార్థి సంఘాలు దాడి చేయడం దురదృష్ట కరమని కోరుట్ల ట్రస్మా సంఘ సభ్యులు అన్నారు. గురువారం పట్టణంలోని కేరళ ఇంగ్లీష్ మీడియా పాఠశాలలో విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు. కార్యక్రమంలో ట్రస్మా సభ్యులు ఎంఏ బారీ, బాలీజీ దామెందదర్, సిదార్థ, రమేష్, శంకర్ శర్మ, మహాదేవ్, సత్యనారాయణలతో పాటు పలువురు పాల్గొన్నారు.

ధర్మపురి ఆలయాన్ని అభివృద్ధి చేస్తా

-ఎస్సీ, ఎస్టీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

ధర్మపురి, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి క్షేత్రంలోని లక్ష్మీ నరసింహ స్వామి దేవాలయాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తానని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, వికలాంగుల సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు, స్థానిక లక్ష్మీ నరసింహ స్వామి దేవాలయంలో గురువారం ఆయన పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయం బయట మంత్రి లక్ష్మణ్‌కుమార్ విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జూబ్లీహిల్స్ ఎన్నికలు పూర్తి కాగానే నా నియోజకవర్గ ప్రజ లను కలవడం నాకు ఎంతో ఆనందంగా ఉందని ఆయన భావోద్వేగంతో వెల్లడించారు. మార్పు కోరుకున్న ప్రజలు ఇందిరమ్మ రాజ్యాన్ని మళ్లీ చూడాలని ఆశిస్తూ కాంగ్రెస్ పార్టీని విశ్వసించారని ఆయన చెప్పారు.



మాట్లాడుతున్న మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చెప్పినట్లు 2034వరకు కాంగ్రెస్ ప్రభుత్వమే కొనసాగుతుందని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, వికలాంగుల సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌తెలిపారు. గత ప్రభుత్వం చేసిన భారీ అప్పుల వల్ల రాష్ట్ర ఆర్థిక పరిస్థితి కఠినంగా ఉన్నా ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారెంటీలను ఏ విధంగానైనా అమలు చేస్తామని పునరుద్ఘాటించారు. పేదల సంక్షేమం, బహుజనుల అభ్యున్నతే మా ప్రభుత్వ ధ్యేయమని ఆయన పేర్కొన్నారు. జిల్లాలో కొనసాగుతున్న గ్రామీణ ప్రాంతాల్లో రోడ్లు, విద్యుత్ సదుపాయాల అభివృద్ధి పనులను వేగవంతంగా చేయాలని సంబంధిత అధికారులను ఆయన ఆదేశించారు. త్వరలోనే డిగ్రీ కళాశాల శాశ్వత భవనం నిర్మాణం ప్రారంభం అవుతుందని ఆయన తెలిపారు. దళిత, బీసీ, ఎస్సీ విద్యార్థుల కోసం ప్రత్యేక నైపుణ్యాభివృద్ధి కేంద్రాలు ఏర్పాటు చేయడం మా ప్రాధాన్యతలో భాగమని ఆయన వెల్లడించారు. ఈ సమావేశంలో ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ జక్కు రవీందర్, మండల కాంగ్రెస్ ఉపాధ్యక్షులు వేముల రాజేష్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు చీపిరిశెట్టి రాజేష్, జిల్లా కాంగ్రెస్ ఎస్సీ సెల్ ఉపాధ్యక్షులు చిలుముల లక్ష్మణ్, ఏఎంసీ వైస్‌చైర్మన్ సంగ నర్సింహులు, మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షులు అప్పం తిరుపతి, ధర్మకర్తలు రాపర్తి సాయికిరణ్, ఏదులాపురం మహేందర్, గుడ్ల రవీందర్, నేదునూరి శ్రీధర్, సంగనభట్ల నరేందర్, సింహరాజు ప్రసాద్, సీపతి సత్యనారాయణ, ఆశెట్టి శ్రీనివాస్, ఒజ్జల లక్ష్మణ్, జంగిలి ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

పంపిణీకి సిద్ధంగా జీవన ఎరువుల ప్యాకెట్లు

కథలాపూర్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఫాస్పరస్ సాల్యూబైలైజింగ్ బాక్టీరియా (ఎఫ్‌ఎస్‌బీ) బాస్వరపు జీవన ఎరువుల పాకెట్లు పంపిణీకి సిద్దంగా ఉన్నాయని మండల వ్యవసాయాధికారిణి యోగిత తెలిపారు. అన్ని రకాల పంటలకు ఈ జీవన ఎరువులు వాడుకోవచ్చన్నారు. భూమిలో 60 శాతం భాస్వరం మొక్కలు గ్రహించకుండా ఉంటుందని దీని వాడకం వలన భాస్వరం కరిగి పూర్తి స్థాయిలో మొక్క ఎదుగుదలకు ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ఈ పీఎస్‌బీని 3 కేజీల కల్చర్ పొడితో 100 కేజీల మాగిన పశువుల ఎరువుతో కలిపి దుక్కిలో వేస్తే ప్రయోజనం ఉంటుందన్నారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

●ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

మల్యాల, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు.

వ్యవసాయ ఉత్పత్తుల సహకార సంఘం ఏర్పాటు చేసుకున్న రైతులు ఆర్థికాభివృద్ధి కోసం వరి ధాన్యం కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయమని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. మండలంలోని మద్దుట్లకు చెందిన సుమారు 130 మంది రైతులు సహకార సంఘం ఏర్పాటు చేసుకోగా వారి ఆధ్వర్యంలో నిర్వహించే వరి ధాన్యం కొనుగోలు కేంద్రంను గురువారం ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో దొంగ ఆనందరెడ్డి, రాంలింగారెడ్డి, బత్తిని శ్రీనివాస్‌గౌడ్, దారం ఆదిరెడ్డి, అల్లూరి రాజేశ్వర్‌రెడ్డి, వెల్మ లక్ష్మారెడ్డి, పోతాని రవి, లక్ష్మణాచారి, మ్యాక లక్ష్మన్, బి.అరున్‌రావు, బండి రవి, నక్క అనిల్, మహిపాల్‌రావు, శరత్, కిషన్‌రెడ్డి, శ్రీకాంత్ పాల్గొన్నారు.



మద్దుట్లలో కొనుగోలు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

అందెశ్రీకి ఘన నివాళి

గొల్లపల్లి, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): ప్రజాకవి, ప్రముఖ వాగ్గేయకారుడు అందెశ్రీని తెలంగాణ సమాజం ఎప్పటికీ మరువదని ప్రముఖ ప్రజాకవి చెన్నాడి వెంకటరమణరావు పేర్కోన్నారు. గురు వారం గొల్లపల్లి మండల కేంద్రంలోని ఆర్యవైశ్య సంఘం భవనంలో అందేశ్రీ సంస్మరణ సభను నిర్వహించగా ఆయన పాల్గొన్నారు. ఈ సందర్బంగా అందేశ్రీ చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘన నివాళు లర్పించారు. కార్యక్రమంలో కవులు, రచయితలు మల్లికతేజ, దేవరాశెట్టి జనార్ధన్, రాగుల పరశురాం, నాయకులు నల్ల శ్యామ్, కచ్చు కోమురయ్య, జక్కుల తిరుపతి, లింగబాబు, శంకరయ్య, సామాజిక కార్యకర్తలు తాడూరి శ్రీనివాస్ చారి, తాడూరి వంశీ, గంగాధర మధుసూదన్, పాఠశాలల విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరం

ఇబ్రహీంపట్నం, నవంబరు13 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు వెల్మల శ్రీనివాసరావు అధ్యక్షతన బసవతారక ఇండో అమెరికా క్యాన్సర్ ఆసుపత్రి, రీసర్చ్ ఇన్స్టిట్యూట్ సౌజన్యంతో ఉచిత క్యాన్సర్ శిబిరాన్ని గురువారం ప్రారంభించారు. ముందుగా విద్యార్థులు, లయన్స్ క్లబ్ సభ్యులు క్యాన్సర్ పై అవగాహన కోసం ర్యాలీ తీశారు. ఇందులో బసవతారక ఇండో అమెరిక్ క్యాన్సర్ ఆసుపత్రి వైద్యులు రవి శంకర్, రేణుక, ప్రవళిక, హరీష్, లక్ష్మణ్, పీఆర్‌ఓ మేనేజర్ బిందు, పబ్లిక్ హెల్త్ మేనేజర్ ప్రేరణలు పాల్గొని ఉచిత క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు చేశారు.

విద్యార్థుల ప్రతిభ

మెట్‌పల్లి టౌన్, నవంబరు13 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శ్రీవిజయ సాయి సెంట్రల్ హైస్కూల్ విద్యార్థులు 1500 మీటర్ల పరుగు పందెల్లో రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారు. విద్యార్థి సంపంగి మనించంద్ర స్టేట్ లెవల్‌కు ఎంపిక కావడం పట్ల గురువారం కరస్పాండెంట్ పుల్ల ప్రదీప్‌గౌడ్ సన్మానించారు.